Follow: @ANNTELUGU
01-06-2026

# మహా పత్రిక

ANN తెలుగు

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 154 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఎస్ఐఆర్ ముసుగులో ఓట్లు ఏరివేసే కుట్ర

- అడ్డుకోవాలన్నపెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ
- శ్రేణులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నరేష్ జాదవ్, కంది శ్రీనివాస రెడ్డి దిశానిర్దేశం
- ఆదిలాబాద్ లో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ-2 ల సమావేశం

**ఆదిలాబాద్ మహా :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎస్ ఐ ఆర్ ముసుగులో ఎలక్షన్ కమీషన్ అండతో ప్రతిపక్షాల ఓట్లని ఏరివేసే చర్యలు చేపడుతుందని పశ్చిమ బెంగాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో ఈవిధంగానే అధికారం దక్కించుకుందని ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్చార్జ్ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ విమర్శించారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ 2 ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమిళనాడు బెంగాల్ ముఖ్యమంత్రులు ఎన్నికల్లో తక్కువ మెజారిటీతో పరాభవం చెందడానికి ఎస్ ఐ ఆర్ కారణమన్నారు. ఉద్దేశపూర్వకంగా ప్రతిపక్ష పార్టీ ల అనుకూల ఓట్లను ఏరవేతతోనే వారు ఓటమి చెందారన్నారు. ప్రధానమంత్రి మోదీ ప్రజలకు ఇంధనం పొదుపు చేయాలని తెలుపుతూ భారీ కాన్వాయిలు వేసుకొని తిరుగుతన్నారని విమానాల ద్వారా ప్రపంచం పర్యటన చేస్తూ మెలోడీ

మిగితా 2వ పేజీలో

టాప్ న్యూస్

## ఈటెల ఏడుపే బీజేపీకి శాపం



- హైదరాబాద్‌లో పోస్టర్ల కలకలం
- రాష్ట్ర బీజేపీలో కుమ్ములాట

02


## రాజకీయం కైలాసం ఆటలాంటిది



- కంటోన్మెంట్ సమావేశంలో కేటీఆర్ నిర్వేదం
- పెద్ద పాము మింగేసి మళ్ళీ మొదటికే తీసుకొస్తుంది

02

## బిజెపి ఒక్క సీటు గెలిచినా.. రాజకీయాల నుండి తప్పుకుంటా



- సంచలన సవాల్
- బిజెపి తెలంగాణలో ఎప్పటికీ అధికారంలోకి రాదు

02

# పెద్దికి పవన్ దెబ్బ

## నవనిర్మాణ సంకల్పసభపై భగ్గుమంటున్న తెలంగాణవాదులు

12 ఏళ్ళయినా.. రాజధానే దిక్కులేదు.. మీరు తెలంగాణను ఏం ఉద్ధరిస్తారంటూ ఫైర్


**తెలంగాణ వచ్చిందని.. 11రోజులు అన్నం మానేశా అని చెప్పిన పవన్**

ఇటీవల కాలంలో దిష్టి వ్యాఖ్యలు.. పవన్ వ్యాఖ్యలను వైరల్ చేస్తున్న తెలంగాణ వాదులు

రాజకీయాలు పక్కనబెట్టి స్పందిస్తున్న తెలంగాణ యువత

**సెంటిమెంట్‌తో.. బిజెపికి షాక్.. రామ్ చరణ్ పెద్దికి షాక్**

పవన్ తెలంగాణ రాజకీయంపై కాంగ్రెస్, బీఆర్ఎస్, తెలంగాణ జేఏసీల ఆగ్రహం



(హైదరాబాద్ మహా)

తెలంగాణ ఆవిర్భావానికి వ్యతిరేకంగా అనేక సందర్భాల్లో మాట్లాడిన జనసేనాని పవన్ కల్యాణ్ తెలంగాణ ఆవిర్భావం రోజు నవనిర్మాణ సంకల్పసభ నిర్వహించడంపై తెలంగాణ వాదులు విస్మయం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలోనే కాదు.. ఎక్కడైనా ఎవరైనా రాజకీయాలు చేయొచ్చు కానీ.. తెలంగాణ ప్రాంతంలో ఉద్యమం నాటి నుండీ తెలంగాణ వ్యతిరేక లైన్ ను తీసుకున్న పవన్ కల్యాణ్ ఇపుడు సరిగ్గా తెలంగాణ ఆవిర్భావం రోజే.. సంకల్ప సభ పెట్టడం మళ్ళీ భావోద్వేగాలు రెచ్చగొట్టే కుట్రగా తెలంగాణ రాజకీయపక్షాలు పేర్కొంటున్నాయి. పవన్ తీరుపై అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ నేతలు భగ్గుమంటుండగా, బిజెపి నేతలు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. తెలంగాణతో పోలిస్తే.. ఏపీలో గత 12 ఏళ్ళ రాజకీయం, డెవలప్ మెంట్ ప్రజల కళ్ళముందు ఉండగా, కనీసం రాజధానికే దిక్కు లేదు.. ఇంకా గ్రాఫిక్స్ తో కాలం గడుపుతున్నారు.. మీరు తెలంగాణను ఏం ఉద్ధరిస్తారంటూ ఫైర్ అవుతున్నారు. గతంలో చంద్రబాబు, వైఎస్ జగన్ తెలంగాణలో

మిగితా 2వ పేజీలో

## ఆర్థిక ఇబ్బందులున్నా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

**ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ఆసిఫాబాద్, మహా :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రూ.20 వేల కోట్ల వ్యయంతో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ ఏర్పాట్లను ఆదివారం మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ఆసిఫాబాద్ జిల్లా నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుడతారని తెలిపారు.



## రష్యా పర్యటనకు మంత్రి నారా లోకేశ్

**జూన్ 2 నుంచి 7 వరకు టూర్**

**పెట్టుబడుల సాధనే టార్గెట్**

**అమరావతి , మహా:** రాష్ట్రంలో సుస్థిరమైన పారిశ్రామిక వాతావరణాన్ని నిర్మించి, విదేశీ పెట్టుబడులను విశేషంగా ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మంత్రి నారా లోకేశ్ జూన్ 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రష్యాలో పర్యటించనున్నారు. రష్యాలోని ప్రతిష్ఠాత్మక సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో జరగనున్న 'సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్

03

## ఇందిరమ్మ ఇండ్ల జోరు.. రేవంత్ సర్కార్ తీరు

**మొదటి విడత సక్సెస్.. రెండో విడత నెక్స్ట్ లెవెల్ ఎక్స్‌ప్రెస్**

**నాడు డబుల్ బెడ్‌రూమ్ డ్రామా.. ఇపుడు ఇందిరమ్మ ఇండ్ల ధీమా**

**తొలివిడతలో రూ.4.5లక్షల ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం..**

**ఇప్పటికే లక్షకు పైగా గృహప్రవేశాలు**

**నేడు రెండో విడత ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి**



(మహా ప్రత్యేక ప్రతినిధి):

తెలంగాణలో పేదల సొంతింటి కల సాకారం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేగంగా పడుతున్నాయి. గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమిస్తూ.. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 'ఇందిరమ్మ ఇండ్ల పథకం' క్షేత్రస్థాయిలో సరికొత్త విప్లవాన్ని సృష్టిస్తోంది. గూడు లేని పేదవాడి కళ్లలో ఆనందం చూడటమే లక్ష్యంగా సాగుతున్న ఈ మహా యజ్ఞం, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా దూసుకుపోతోంది. రూ. 22,500 కోట్ల


మిగితా 2వ పేజీలో



## ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

03

- నోవాటెల్ హోటల్‌లో గంటన్నర పాటు చర్చలు
- సీఎంతో పాటు కలిసిన ఇన్ ఛార్జి మీనాక్షి, పీసీసీ చీఫ్, డిప్యూటీ సీఎం భట్టి



వైఎస్సార్ విగ్రహాల ధ్వంసంపై

## భగ్గుమన్న వైఎస్ షర్మిల

**తక్షణమే కొత్త విగ్రహం పెట్టకపోతే ఆమరణ దీక్ష**

**నంద్యాల,మహా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలపై ఉద్దేశపూర్వకంగా కొనసాగుతున్న దాడులు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీస్తున్నాయి. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే విగ్రహాలను

03

## రైతు డిస్కం వెనుక భారీ కుట్ర


**ప్రైవేటీకరణకే ప్రభుత్వాల పావులు**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ధ్వజం.**



**హైదరాబాద్, మహా.** రాష్ట్రంలో కొత్తగా వ్యవసాయ డిస్కంను ఏర్పాటు చేసి, మిగతా రెండు విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేట్ పరం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ కుట్ర పన్నుతోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యుత్ రంగ సంస్కరణల ముసుగులో బడా కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని,

03



## ఐపీఎల్ 2026 ఛాంపియన్ ఆర్సీబీ

- వరుసగా రెండోసారి బెంగళూరు విక్టరీ
- అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించిన విరాట్ కోహ్లీ


07




# స్నేహిత బిల్డర్స్ మజాకా..


- పీరం చెరువు బఫర్ జోన్ ఆక్రమణ
- లంచాలు మెక్కి అనుమతులు జారీ
- పిర్యాదులు అందిన పట్టించుకోని అధికారులు
- హైడ్రా స్పందించాలంటున్న స్థానికులు..

చెరువులు, నాలాలు, కుంటలను కాపాడాలనే సంకల్పంతో కోట్లాది రూపాయిలు వెచ్చించి ప్రభుత్వం హైడ్రా ను ఏర్పాటు చేసి పూర్తి స్వేచ్ఛను అప్పగించింది.. ఎన్ని చట్టాలు తెచ్చిన అవినీతి అధికారుల ధన దాహానికి అవి వెల వెల బోతున్నాయి.. రియల్టర్లు విసిరిన కాసులకు కక్కుర్తి పడి పీరం చెరువు బఫర్ జోన్ లో ఉన్న స్నేహిత బిల్డర్స్ కు ఎన్వోసి జారీ చేసి ఇరిగేషన్ చట్టాలకు తూట్లు పొడిచారని బహిరంగ ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి.. ఇరిగేషన్ ఎన్వోసి తో సదరు బిల్డర్ బహుళంతస్తుల నిర్మాణ అనుమతులు పొందటం అవినీతి అధికారుల బరితెగింపుకు పరాకాష్టగా నిలుస్తోందన్నారు..




**హైడ్రా అధికారులు స్పందించాలంటున్న స్థానికులు**

:బండ్లగూడ సర్కిల్లో గల పీరం చెరువును కాళీ మందిర్(ఆరే మైసమ్మ )సాక్షిగా అక్రమార్కులు చెరబట్టారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నా చెరువు బఫర్ జోన్, ఎఫ్ టీ ఎల్ దురాక్రమణకు గురైందని హైడ్రా కమీషనర్ స్పందించి చెరువు ను సర్వే చేయించి అక్రమార్కుల చెరలో ఉన్న చెరువు భూమి కాపాడాలని సర్కిల్ ప్రజలు కోరుతున్నారు.














**స్పెషల్ టాస్క్ ఫోర్స్ హైదరాబాద్ మహా :**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ పీరం చెరువు బఫర్ జోన్ దురాక్రమణకు గురైంది. సర్వే నెంబర్ 24/ఏ /2 స్నేహిత బిల్డర్స్ పేరుతో బఫర్ జోన్ ను ఆక్రమించారు. అంతే కాకుండా పక్కనే ప్రవహిస్తోన్న నాలాను సైతం చెరబట్టారు.హెచ్ ఎం డీ ఏ లేకుల ప్రకారం పీరం చెరువు ఐ డీ నెంబర్ 2933 గా ఇరిగేషన్ రికార్డుల బట్టి తెలుస్తోంది.దీని విస్తరణ 30.801ఎకరాలు కాగా, ఫుల్ ట్యాంక్ లెవల్ 1848.458 (ఎఫ్ టీ ఎల్ )మీటర్లగా ఇరిగేషన్ అధికారులు నిర్ణయించి 24మీటర్ల మేరకు బఫర్ జోన్ హద్దులు ఏర్పాటు చేసారు. సర్వే నెంబర్ 24/ఏ /2లో గల భూమి సుమారు 1200 గజాలు పూర్తిగా బఫర్ జోన్ లో వస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఇదిలా ఉంటే ఇదే స్థలంలో ట్రాక్టర్లతో మట్టి పోసి నింపుతుండగా అప్పటి రెవెన్యూ ఇన్స్పెక్టర్ నరసింహా గౌడ్ అడ్డుకొని ఆక్రమణ దారులపై కేసులు నమోదు చేసారని స్థానికులు పేర్కొంటున్నారు.బఫర్ జోన్ ఆక్రమించి సదును చేయటమే కాకుండ అనుమతులు లేకుండా రెండు బోర్లు వేసారని అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రస్తుతం ఇరిగేషన్ లో పనిచేస్తున్న ఏ ఈ నర్సింహా కు పిర్యాదు చేస్తే నేటి వరకు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని లంచాలు మింగి అక్రమార్కులకు రాచ బాట వేశారని స్థానిక ప్రజలు మండి పడుతున్నారు. ఇరిగేషన్ ఎన్వోసి ఆధారంగా ఆనాటి బండ్లగుడా జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి నిర్మాణ అనుమతులు పొందారని వారు ఆరోపిస్తున్నారు.నిర్మాణ అనుమతులపై టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి రాకేష్ ను వివరణ కోరగా గతంలో పనిచేసిన అధికారులు ఇచ్చి ఉంటారని, జారీ చేసిన అనుమతులను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

# పెద్దికి పవన్ దెబ్బ



**( మొదటి పేజీ తరువాయి )**

రాజకీయానికి ప్రయత్నించి.. ఈ ప్రాంతంలో ఉన్న భావోద్వేగాలు, సవాళ్ళను పరిగణనలోకి తీసుకుని ఏపీకే పరిమితమయ్యారు. తెలంగాణ సెంటిమెంట్ ను గౌరవిస్తూ.. తెలంగాణ ప్రాంతంపై ఎంతో సున్నితంగా వ్యవహరిస్తారు. జనసేన క్యాడర్ ఇందుకు భిన్నంగా ఉంది. అన్నింటికీ ఒకేమంత్రంలా దాడి చేస్తున్నారని, అంతిమంగా ఇది పవన్ కల్యాణ్ తో పాటు మెగా ఫ్యామిలీ సినిమాలకు, రోడ్ మ్యాప్ ఇచ్చిన బిజెపికి నష్టం చేస్తున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**పెద్దికి పెద్ద దెబ్బ**

పవన్ కల్యాణ్ నవనిర్మాణసభ జూన్ 2న నిర్వహిస్తుండగా, జూన్ 4న రామ్ చరణ్ నటించిన భారీ బడ్జెట్ సినిమా పెద్ది రిలీజ్ కానుంది. పవన్ సభపై తెలంగాణలో ఆగ్రహం వ్యక్తం అవుతుండగా, ఉద్యమకారులు పెద్ది థియేటర్ల వద్ద నిరసనలకు ప్లాన్ చేస్తున్నారు. పవన్ కల్యాణ్ కొండగట్టుకు వచ్చినపుడు ఇక్కడి ప్రభుత్వం, నాయకులు స్వాగతించగా, ఇపుడు సెంటిమెంట్ రెచ్చగొట్టే సభ నిర్వహిస్తున్నారని ఆందోళన చేస్తున్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ , జగన్ కు సంబంధించిన అంశం భిన్నమైనదని, అయితే తెలంగాణలో నవనిర్మాణ సంకల్ప సభ నిర్వహించడం అస్తిత్వంపై దాడికి తొలి అడుగు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి రాష్ట్ర వ్యాప్తంగా క్యాడర్, అభిమానులు ఉన్నారు. అయినా ప్రజల్లో ఉన్న భావోద్వేగాలు, నా ప్రాంతం అనే ఐక్యత పరిగణనలోకి తీసుకుని ఎపుడూ సున్నితంగా ఉంటారు. మలిదశ తెలంగాణ ఉద్యమసమయంలో దాదాపు 1200మంది విద్యార్థులు, యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆ ఆత్మహత్యలకు ఆంధ్రాప్రాంత నాయకుల అడ్డంకులు, రెచ్చగొట్టడమే కారణమన్న అభిప్రాయం కిందివరకూ ఉంది. తెలంగాణలో ఆ సెంటిమెంట్ ఎపుడూ ఉంటుంది. రాష్ట్రసాధన ఉద్యమంలో పనిచేసిన వారంతా.. లైవ్ లోనే ఉన్నారు. అస్తిత్వంపై దాడి జరుగుతుందన్న అభిప్రాయం కలిగినపుడు దాడులు, ఆత్మహత్యలు ఇలాంటి వాటికి వెనుకాడరని గతంలో అనేక సందర్భాల్లో రుజువులున్నాయి. జనసేన విషయానికొస్తే.. ప్రస్తుతం తెలంగాణలో కార్యకలాపాలు ప్రారంభిస్తున్న సమయంపై చర్చ జరుగుతోంది. ప్రజారాజ్యం సందర్భం, తర్వాత జనసేన ఆవిర్భావ సందర్భంలో కూడా పవన్ ఏపీ లైన్ లోనే ఉన్నారు. తర్వాత తెలంగాణ ఆవిర్భావం తప్పుడు పద్ధతుల్లో జరిగిందని, తెలంగాణ వాళ్ళ దిష్టి తగిలిందని ఇంకా ఈ 12 ఏళ్ళ కాలంలో ఏపీలోని పరిస్థితులను బట్టి తెలంగాణపై పలు కామెంట్స్ చేశారు. తెలంగాణలో పవన్ కల్యాణ్ కు అనేకమంది అభిమానులు ఉన్నారు. ప్రజలను మెప్పించేలా ఎలా రాజకీయం చేస్తారన్నది ఆసక్తికరం. చరిత్ర, తెలంగాణలో తాజా భావోద్వేగాలను బట్టి చూస్తే పవన్ సభలు నిర్వహించడం, కార్యకలాపాలు నిర్వహించడం పెద్ద సవాలే. ఘర్షణ పూర్వక వాతావరణం నెలకొంటే.. అది బిజెపికి మరింత నష్టం చేసే అవకాశముంది. అయితే ఏం జరుగుతుందో చూద్దాం.. ఎంతకాలం ఇలా కామ్ గా ఉంటామని పవన్ బయలుదేరినట్లు చెబుతున్నారు..

# ఎప్పటికీ మీరే నా హీరో

**మహేష్ బాబు ఎమోషనల్ ట్వీట్**

సూపర్ స్టార్ కృష్ణ వారసుడిగా చిత్ర పరిశ్రమకు ఎంట్రీ ఇచ్చారు మహేష్ బాబు. చైల్డ్ ఆర్టిస్ట్ గానే సినిమాల్లో అదరగొట్టి.. యువరాజుతో హీరోగా ఆరంగేట్రం చేశారు. నాటి నుంచి తనదైన శైలిలో విభిన్న పాత్రల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. హిట్లు, సూపర్ హిట్లు, బ్లాక్ బస్టర్స్, ఇండస్ట్రీ హిట్స్ ఇలా మహేష్ ఖాతాలో లేని సినిమా అంటూ లేదు. రీజినల్ ఫిల్మ్స్ తోనే పాన్ ఇండియా చిత్రాలకు సైతం పోటీ ఇచ్చే స్థాయిలో తన సత్తా ఏంటో నిరూపించుకున్నారు ఈ సూపర్ స్టార్. మే 31న కృష్ణ జయంతి సందర్భంగా మహేశ్‌బాబు సోషల్ మీడియాలో చేసిన ఓ భావోద్వేగ పోస్టు అభిమానుల హృదయాలను కదిలించింది. "ఫరెవర్ మైహీరో... హ్యాపీ బర్త్ డే నాన్న" అంటూ మహేష్ బాబు తన తండ్రిని స్మరించుకున్నారు. కృష్ణ భౌతికంగా మన మధ్య లేకపోయినా, తన జీవితంలో ఆయన స్థానం ఎప్పటికీ చెరిగిపోదని మహేశ్ మరోసారి తెలియజేశారు. మహేష్ సినీ ప్రయాణానికి పునాది వేసింది కృష్ణే. చిన్నతనంలోనే తన కుమారుడిలోని నటన ప్రతిభను గుర్తించిన కృష్ణ.. బాలనటుడిగా వెండితెరకు పరిచయం చేశారు.



# ఇందిరమ్మ ఇండ్ల జోరు.. రేవంత్ సర్కార్ తీరు



**మొదటి పేజీ తరువాయి )**

భారీ బడ్జెట్‌తో ప్రతి నిరుపేదకూ రేవంత్ సర్కార్ అండగా నిలుస్తోంది. తొలివిడతలో 4.5లక్షల ఇండ్ల నిర్మాణం ప్రారంభించగా, ఇప్పటికే లక్షకు పైగా గృహప్రవేశాలు జరగడం రికార్డు. మరో లక్ష ఇండ్ల దాకా నిర్మాణం పూర్తి దశలో ఉన్నాయి. రెండో విడతలో ఇపుడు 2.5లక్షల ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు.

**శరవేగంగా గృహప్రవేశాలు**

రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించడంతో అర్హులైన ప్రతి పేదవాడికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందుతోంది. హౌసింగ్ బోర్డు అధికారులు సరికొత్త యాప్ ద్వారా పనులను పర్యవేక్షిస్తున్నారు.

మొత్తం మంజూరైన ఇళ్ళు: తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.ప్రోగ్రెస్ రిపోర్ట్: ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షకు పైగా ఇండ్లు పూర్తికాగా, లబ్ధిదారులు గృహప్రవేశాలు కూడా చేశారు. మరో లక్ష ఇండ్లు శరవేగంగా తుది దశకు (స్లాబ్ మరియు ఫినిషింగ్) చేరుకున్నాయి. మిగిలిన ఇండ్లు పునాదుల స్థాయిలో పనులు జరుపుకుంటున్నాయి.నిధుల విడుదల: ఏజెన్సీ ప్రాంతాల నుంచి మొదలుకొని మైదాన ప్రాంతాల వరకు నాణ్యతా ప్రమాణాలతో, కనీసం 400 చదరపు అడుగుల వైశాల్యంలో, ఆర్‌సీసీ రూఫ్, వంటగది, మరియు టాయిలెట్ తప్పనిసరిగా ఉండేలా 4 విడతల్లో నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకే నిధులు జమవుతున్నాయి.

**టాప్ జిల్లాగా ఖమ్మం:**తొలి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిలో, లబ్ధిదారుల ఎంపిక మరియు గ్రౌండింగ్ ప్రక్రియలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో దూసుకుపోతోంది. స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయం, అధికారుల నిరంతర పర్యవేక్షణతో ఇక్కడ పనులు రికార్డు స్థాయిలో సాగుతున్నాయి.

**రెండో విడత లక్ష్యం ఇదే!**

తొలి విడత విజయవంతం కావడంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర క్యాబినెట్ రెండో విడతకు ఆమోదం తెలిపింది. ఈ పథకాన్ని మరింత వేగవంతం చేస్తూ జూన్ 1 నుంచి రెండో విడత పనులు ప్రారంభం కానున్నాయి. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇండ్లను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 2,000 ఇండ్లను కేటాయించారు.

హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలో స్థలాలు లేని పట్టణ పేదల కోసం ప్రభుత్వం 39 ప్రాంతాలను గుర్తించింది. ఇక్కడ హౌసింగ్ బోర్డు ద్వారా దాదాపు 1 లక్ష ఇండ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ ఇండ్లను పూర్తిగా ఉచితంగా, మహిళల పేరిటే రిజిస్ట్రేషన్ చేయించనున్నారు.

అసంపూర్తి ఇండ్లకు ఆర్థిక సాయం: గతంలో (ఉమ్మడి ఏపీలో) పునాదుల దశలోనే నిలిచిపోయిన ఇండ్లకు రూ. 3 లక్షలు, గోడలు పూర్తయి స్లాబ్ పడని ఇండ్లకు రూ. 2 లక్షల చొప్పున అదనపు సాయం అందించి వాటిని పూర్తి చేయించాలని క్యాబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.

**బీఆర్ఎస్ వైఫల్యం.. కాంగ్రెస్ పొలిటికల్ మైలేజ్**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో కేవలం 46,000 డబుల్ బెడ్రూమ్ ఇండ్లను మాత్రమే నిర్మించిందని, అందులోనూ 21,000 ఇండ్లకు కనీస వసతులు (తాగునీరు, డ్రైనేజీ) కల్పించకుండా పేదలను వంచించిందని కాంగ్రెస్ ప్రభుత్వం గణాంకాలతో సహా నిరూపించింది. రాష్ట్రంలోని 12,000కు పైగా గ్రామ పంచాయితీల్లో బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఇల్లు కూడా మంజూరు కాని గ్రామాలు వేలల్లో ఉన్నాయి. దీన్ని సరిదిద్దుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'ఇందిరమ్మ ఇండ్ల' పథకాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లింది. పార్టీలతో సంబంధం లేకుండా, కేవలం "పేదరికమే ప్రామాణికంగా" గ్రామసభల ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనిని కాంగ్రెస్ కేవలం ఏడాదిన్నర కాలంలోనే చేసి చూపించడంతో, గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని పొలిటికల్ మైలేజీ లభించింది. తెలంగాణ పేదల కళ్లలో ఆనందమే దీనికి నిదర్శనం.

**రేవంత్ పట్టుదల.. పొంగులేటి సవాల్!**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని కేవలం ఒక హామీగా కాకుండా, ప్రభుత్వ ప్రతిష్టగా భావించి పట్టుదలతో ముందుకు నడిపిస్తున్నారు. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఆసిఫాబాద్ వేదికగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించబోతున్నారు.

ఇక గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తనదైన శైలిలో పట్టుదలతో ఈ ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తున్నారు. ఇటీవలే ఆయన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. "గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే మెరుగైన, నివాసయోగ్యమైన ఇండ్లను పేదలకు నిర్మించి ఇవ్వకపోతే వచ్చే ఎన్నికల్లో నేను పోటీనే చేయను" అంటూ బహిరంగ సవాల్ విసిరారు. మంత్రి పొంగులేటి క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ, ఎక్కడా అవినీతికి తావులేకుండా నిధులు నేరుగా లబ్ధిదారులకు అందేలా చూస్తుండటంతో పనుల్లో వేగం పెరిగింది.

మొత్తానికి, రేవంత్ రెడ్డి మార్క్ పాలనలో.. పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతర పర్యవేక్షణలో సాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం తెలంగాణలో నిరుపేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోంది. 'మహా' పత్రిక క్షేత్రస్థాయి పరిశీలనలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాల పట్ల

# ఎస్ఐఆర్ ముసుగులో ఓట్లు ఏరివేసే కుట్ర




**(మొదటి పేజీ తరువాయి )**

చాక్లెట్లు పంచుతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నుండి దేశంలో ప్రజాస్వామ్య రక్షణ కోసం అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కును కాపాడడం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికలేవైనా కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు.

**బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలి - ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్**

బీజేపీ ఎస్ఐఆర్ తో తమకు అనుకూలం కాని ఓట్లు ఏరివేసే పని చేస్తుందని తమ బూత్ లలో ఓట్ల తొలగింపు జరగకుండా బీఎల్వోలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఈవిషయంలో ఎట్టిపరిస్థితులలో నిర్లక్ష్యం పనికి రాదన్నారు. బీజేపీ చేస్తున్న రైతుభరోసా యాత్ర దండుపాళ్యం యాత్రగా విమర్శించారు.రైతులను మాయ మాటలతో తప్పుదో పట్టిస్తున్నారని అన్నారు. అటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కష్టం వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ లో ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవడంలో బిఎల్ఎ ల పాత్ర కీలకమని ఆయన తెలిపారు. అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతియే లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.ఆదిలాబాద్ పట్టణంలో పార్టీ నిర్వహించిన బీఎల్ఏ2ల సమావేశానికి ఆయన హాజరయ్యారు. బీఎల్ఎ1 అంటే డీసీసీ అధ్యక్షుడని బీఎల్ఏ2 బూత్ లెవెల్ ఏజెంట్లు అని విడమర్చి చెప్పారు. ఎస్ ఐఆర్ ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమకు అనుకూలంగా లేని ప్రతిపక్షాల ఓట్లు తొలగించే చర్యలు చేపడుతుందని దీన్ని బీఎల్ఏ2లు సమర్ధవంతంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న ఎంపీటీసీ జడ్పీటీసీ అనంతర ఎమ్మెల్యే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు. సీసీఐ విషయంలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదిలాబాద్ ప్రజలను మోసం చేసారని విమర్శించారు. బీజేపీ ఎమ్మెల్యేగా ఉండి సీసీఐ ని పునరుద్దరించలేక పోయారన్నారు. సీసీఐ ని తుక్కుకింద అమ్మడం ఆయన ఫెయిల్యూర్ గా అభివర్ణించారు. రాజకీయాలలో తొందరపాటు పనికి రాదని సహనంగా వేచి చూస్తే అందరికి పదవులు అవకాశాలు వస్తాయన్నారు. పార్టీని నమ్ముకొని పనిచేయాలన్నారు. అలాగే ప్రభుత్వ ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా అవి పూర్తిగా ప్రజల్లోకి చేరేలా శ్రేణులు ప్రచారం కల్పించాలని కోరారు. బీజేపీ కుట్రపూరిత ఓట్ల తొలగింపును అడ్డుకుని పార్టీ విజయానికి దోహదపడాని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్లు రమేష్, అబ్దుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్, ఆదిలాబాద్ ,జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్లు బోరంచు శ్రీకాంత్ రెడ్డి, అల్లూరి అశోక్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మసంతోష్ రావు, నాయకులు సాజీద్ ఖాన్, అల్లూరి సంజీవ రెడ్డి, గండ్రత్ సుజాత, అడ్డి భోజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతు డిస్కం వెనుక భారీ కుట్ర



రైతాంగానికి, పేదలకు ద్రోహం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. రైతు డిస్కం అంశాన్ని ఆరు నెలల పాటు అత్యంత గోప్యంగా ఉంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిన్నటి రోజున కేవలం చిట్ చాట్‌లో దాని గురించి మాట్లాడటం సరికాదని కవిత విమర్శించారు. 24 గంటల ఉచిత విద్యుత్‌ను ఎత్తివేయం అని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టబోమని ముఖ్యమంత్రి చెబుతున్న మాటల్లో నిజాయితీ ఉంటే, ఆ విషయాన్ని అధికారికంగా ప్రెస్ మీట్ ద్వారా రాష్ట్ర ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. బహిరంగ సభల్లో ఇచ్చిన హామీలనే తుంగలో తొక్కిన ముఖ్యమంత్రి.. చిట్ చాట్ మాటలను రేపు సులభంగా మార్చేస్తారని ఎద్దేవా చేశారు. మిగతా రెండు డిస్కంలను ప్రైవేట్ పరం చేస్తే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగబోమని సీఎం స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. కేంద్రం తీసుకువస్తున్న విద్యుత్ సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం వంతపాడుతోందని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో స్కూళ్ల నిర్వహణ, హైడ్రా వ్యవహారశైలిపై సాక్షాత్తూ న్యాయస్థానాలే ప్రభుత్వాన్ని మందలిస్తున్నా పాలకుల్లో మార్పు రావడం లేదన్నారు. బడా వ్యక్తులు చేసిన కబ్జాలపై తాను స్వయంగా ఫిర్యాదులు చేసినా హైడ్రా వాటిని పక్కన పెట్టి.. కేవలం పేదలను మాత్రమే ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ పసిగుడ్డు చేయి తీసేయాల్సిన దుస్థితి తలెత్తడం అత్యంత బాధాకరమన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో డబ్బులు అయిపోయి ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే, సరైన వైద్యం అందించకపోవడం దారుణమన్నారు. దీనిపై ముఖ్యమంత్రి, ఖమ్మం జిల్లా మంత్రులు తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఆ చిన్నారి పేరిట రూ. 25 లక్షలు డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, పాలమూరు ప్రాజెక్టు సమీక్ష కోసం కుమ్మెర గ్రామానికి వెళ్తున్న సీఎం.. అక్కడే కుల వివక్షకు బలైన ఓ చిన్నారి కుటుంబాన్ని తప్పక పరామర్శించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాలమూరు ప్రాజెక్టులో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను దసరా లోపు ప్రభుత్వం ప్రారంభించకపోతే, ఆ మరుసటి రోజు నుంచే తాను పాదయాత్ర చేపడతామని కవిత అల్టిమేటం జారీ చేశారు.

# బెంగాల్ లో 35 ఏళ్ళ నాటి సీన్ రిపీట్

- అభిషేక్ పై దాడితో మళ్ళీ టీఎంసీకి ఊపు
- 1990లో మమతపై జరిగిన దాడిని గుర్తు చేస్తున్న సంఘటన
- మమతకు ఫోన్ చేసి మాట్లాడిన రాహుల్ గాంధీ
- వరుసగా ఎంపీలపై బీజేపీ కార్యకర్తల దాడి
- జూన్ 6న ఇండియా కూటమి కీలక సమావేశం



ఢిల్లీ, మహా : మమతకు మళ్ళీ కలిసోస్తుందా? బిజెపినే అందుకు ఛాన్స్ ఇస్తున్నదా? టీఎంసీ ఎంపీలపై బెంగాల్ లో బీజేపీ కార్యకర్తలు చేస్తున్న వరుస దాడులు.. ఓటమి అనంతరం ఆ పార్టీకి అనూహ్యంగా సానుభూతి, మద్దతు తీసుకొస్తున్నాయి. మూడున్నర దశాబ్దాల క్రితం తనపై జరిగిన దాడితో రాజకీయంగా ఉన్నత శిఖరాలకు చేరిన మమతా బెనర్జీకి.. ఇప్పుడు ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడి మరో రాజకీయ పునరుజ్జీవానికి నాంది పలుకుతుందా? ఎన్నికల ఓటమి, అంతర్గత సంక్షోభంతో బలహీనపడిన తృణమూల్ కాంగ్రెస్‌కు ఇది కొత్త మలుపు అవుతుందా? అనే చర్చ బెంగాల్ రాజకీయాల్లో జోరుగా సాగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల తర్వాత సంక్షోభంలో ఉన్న టీఎంసీకి ఈ ఘటన అనూహ్య షాక్‌కు గురిచేసింది. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు, ఎంపీ అభిషేక్ బెనర్జీపై కొందరు దుండగులు దాడికి పాల్పడ్డారు. లైవ్ కెమెరాల ముందే ఆయనపై రాళ్లు, కోడిగుడ్లతో విరుచుకుపడ్డారు. హెల్మెట్ ఉండటంతో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఆ తర్వాత అభిషేక్ వీల్‌చైర్‌పై ఆసుపత్రిలో ఉన్న దృశ్యాలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపాయి.

ఈ కష్టకాలంలో మమతా బెనర్జీకి 'ఇండియా' కూటమి నుంచి అనూహ్య మద్దతు లభించింది. గతంలోని రాజకీయ విభేదాలను పక్కనపెట్టి పలువురు జాతీయ నేతలు ఆమెకు సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్వయంగా మమతకు ఫోన్ చేసి పరామర్శించారు. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఖండించారు. అవసరమైతే అభిషేక్‌కు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించేందుకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఇది బీజేపీ కక్షసాధింపు రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కోల్‌కతాకు వచ్చి మరీ మమతను పరామర్శించారు. అరవింద్ కేజ్రీవాల్, తేజస్వి యాదవ్ వంటి వారు కూడా మద్దతు ప్రకటించారు. 1990లో జరిగిన దాడి మమతను బెంగాల్‌లో తిరుగులేని శక్తిగా మార్చింది. ప్రస్తుతం పార్టీ సంక్షోభంలో ఉన్న తరుణంలో అభిషేక్‌పై జరిగిన ఈ దాడి, బలహీనపడిన టీఎంసీకి, ప్రతిపక్ష కూటమికి కొత్త ఊపునిస్తుందా లేదా అన్నది కాలమే తేల్చాలి.

**మరో టీఎంసీ ఎంపీపై దాడి**

హుగ్లీ జిల్లాలోని చండీతాలలో ఎంపీ కల్యాణ్ బెనర్జీ పర్యటిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా సిబ్బంది జనాన్ని అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే కొందరు ఆయన తలపై కొట్టారు. ఈ అనూహ్య పరిణామంతో ఆయన తల పట్టుకుని కిందపడిపోయారు. ఈ ఘటనతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దాడికి ముందు స్థానిక బిజెపి కార్యకర్తలు కొందరు కల్యాణ్ బెనర్జీకి నల్ల జెండాలు చూపిస్తూ 'చోర్ చోర్' అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శనివారం దక్షిణ 24 పరగణాల జిల్లా సోనార్‌పూర్‌లో అభిషేక్ బెనర్జీ పర్యటనలోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. దీంతో టీఎంసీ ఎంపీలపై దాడి దేశవ్యాప్త చర్చకు దారితీస్తోంది. జూన్ 6న ఇండియా కూటమి కీలక భేటీ జరగనుంది. ఆ తర్వాత దాడులపై కార్యాచరణ తీసుకునే అవకాశముంది.




# ఈటెల ఏడుపే బీజేపీకి శాపం

- హైదరాబాద్ లో పోస్టర్ల కలకలం
- రాష్ట్ర బీజేపీలో కుమ్ములాట

హైదరాబాద్, మహా : రాష్ట్ర బీజేపీలో కుమ్ములాటలు మరోసారి పోస్టర్లెక్కాయి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను లక్ష్యంగా చేసుకుని మేడ్చల్ ఓఆర్ఆర్ సర్వీస్ వద్ద వెలసిన ఫ్లెక్సీలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. "నీ ఏడుపే బీజేపీకి శాపం" అనే శీర్షికతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఈటల పై పలు విమర్శలు చేశారు. రాష్ట్ర అధ్యక్ష పదవి రాలేదని, సీఎం అభ్యర్థిగా ప్రకటించలేదని, కేంద్ర మంత్రి పదవి దక్కలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారంటూ ఫ్లెక్సీల్లో పేర్కొన్నారు. రెండు చోట్ల ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించడంతో పాటు, ఓటమి అనంతరం మల్కాజ్గిరి ఎంపీ టికెట్ ఇచ్చింది బీజేపీయేనని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గెలుపొందిన తర్వాత కూడా "నా ఇమేజ్‌తోనే గెలిచాను" అని చెప్పడం రాజకీయ నైతికత కాదని ఫ్లెక్సీల్లో విమర్శించారు. అలాగే బీసీ నాయకుడు ఎదుగుతుంటే అసహనం ఎందుకని, ఎంపీ ధర్మపురి అరవింద్‌కు లభిస్తున్న ఆదరణను చూసి కడుపుమంట ఎందుకని ప్రశ్నించారు."నేను బీసీ నాయకుడిని.. నేనే ప్రత్యామ్నాయం" అనే భావన నుంచి బయటకు రావాలని ఈటలకు సూచిస్తూ ఫ్లెక్సీల్లో వ్యాఖ్యలు చేశారు. ఈ ఫ్లెక్సీలను ఎవరు ఏర్పాటు చేశారు, వాటి వెనుక ఉద్దేశం ఏమిటన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా కేంద్రమంత్రి బండి సంజయ్, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ ల మధ్య గత కొంతకాలంగా పరోక్ష డైలాగ్ వార్ సాగుతుండగా, బండి వర్గీయులపైనే ఈటల వర్గీయులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒకే పోస్టర్ తో అటు ఈటలను టార్గెట్ చేసి, ఇటు ధర్మపురి అర్వింద్ ను ఇరికించాలని ఎవరో కుట్రచేసినట్టు బిజెపి రాష్ట్రపార్టీ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. బిజెపి ఎదుగుదలను జీర్ణించుకోలేక ఇతరపార్టీలు ఇలాంటి కుట్రలు చేస్తున్నాయని బిజెపి స్టేట్ చీఫ్ రామచందర్



## బిజెపి ఒక్క సీటు గెలిచినా.. రాజకీయాల నుండి తప్పుకుంటా

**హైదరాబాద్, మహా** : తెలంగాణ రాజకీయాలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలపై, రాబోయే ఎన్నికల్లో కమ్యూనిస్టుల వ్యూహాలపై కీలకమైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ఎప్పటికీ అధికారంలోకి రాలేదని కూనంనేని సాంబశివ రావు స్పష్టం చేశారు. కేవలం సెంటిమెంట్, భావోద్వేగాలను రెచ్చగొట్టే రాజకీయాలు మాత్రమే బీజేపీకి వచ్చని, కానీ అలాంటి విన్యాసాలు తెలంగాణలో అస్సలు పనిచేయవన్నారు. ముఖ్యంగా కమ్యూనిస్టుల కంచుకోట అయిన ఖమ్మం జిల్లాలో బీజేపీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "ఒకవేళ ఖమ్మంలో బీజేపీ ఒక్క సీటైనా గెలిస్తే.. నేను ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పి.. రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను" అంటూ కూనంనేని సంచలన సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టుల పొత్తుల వ్యూహం పూర్తిగా మారబోతోందని కూనంనేని వెల్లడించారు. "ఇకపై ఒకటి, రెండు సీట్లు ఇచ్చే పార్టీలతో మేము పొత్తులు పెట్టుకునే ప్రసక్తే లేదు. గౌరవప్రదంగా కనీసం ఐదు సీట్లకు తగ్గకుండా ఇచ్చే పార్టీలతోనే రాబోయే ఎన్నికల్లో పొత్తులు ఉంటాయి" అని ఆయన తేల్చి చెప్పారు.



## ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

హైదరాబాద్, మహా : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతల బృందం ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఆదివారం ఉదయం సమావేశమైంది. ఢిల్లీ నుంచి కర్ణాటకలోని గుల్బర్గా (కలబురగి) వెళ్లే క్రమంలో విమాన ప్రయాణం మధ్యలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆదివారం హైదరాబాద్‌లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని నోవాటెల్ హోటల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రితో పాటు ఈ కీలక సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు. సుమారు గంటన్నర పాటు అత్యంత ఆత్మీయ వాతావరణంలో సాగిన ఈ సుదీర్ఘ భేటీలో రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ ప్రాధాన్యతలు, ఆరు గ్యారెంటీల అమలు తీరుపై ప్రధానంగా చర్చించారు.

# రష్యా పర్యటనకు మంత్రి నారా లోకేశ్

**( మొదటి పేజీ తరువాయి )**

ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో ఆయన పాల్గొంటారని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ప్రపంచంలోని అతిపెద్ద వ్యాపార, పెట్టుబడి వేదికలలో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ సుప్రసిద్ధ అంతర్జాతీయ సదస్సుకు ప్రపంచం నలుమూలల నుంచి అగ్రశ్రేణి వ్యాపారవేత్తలు, పారిశ్రామిక దిగ్గజాలు, విధాన నిర్ణేతలు భారీ ఎత్తున హాజరుకానున్నారు. ఈ విశిష్ట వేదిక ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను, అత్యంత సానుకూలమైన పారిశ్రామిక విధానాలను మంత్రి లోకేశ్ అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్లనున్నారు.

ఈ ఆరు రోజుల చరిత్రాత్మక పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్ పలువురు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, వివిధ బహుళజాతి కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై ముఖాముఖి చర్చలు జరపనున్నారు. ప్రధానంగా సమాచార సాంకేతిక (ఐటీ) రంగం, విద్యా వ్యవస్థల ఆధునికీకరణ, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ, గ్రీన్ టెక్నాలజీ తదితర కీలక రంగాల్లో భారీ ప్రాజెక్టులను రాష్ట్రానికి తీసుకురావడమే లక్ష్యంగా ఆయన తన కార్యాచరణను రూపొందించారు. ఈ విదేశీ పర్యటనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి పొలిటికల్ క్లియరెన్స్ సైతం లభించినట్లు అధికారిక వర్గాలు ధృవీకరించాయి. ఈ పర్యటనకు అయ్యే పూర్తి ఖర్చులను ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఏపీఈడీబీ) తన సొంత బడ్జెట్ నుంచి భరించనున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఏపీని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పానికి అనుగుణంగా జరుగుతున్న ఈ రష్యా పర్యటన ద్వారా రాష్ట్ర భవిష్యత్తును మార్చే స్థాయి పెట్టుబడులు వస్తాయని అధికార యంత్రాంగం ఎంతో ఆశాభావంతో ఎదురుచూస్తోంది.

# రియల్ రంగానికి డబుల్ ట్రబుల్

**రియల్ రంగానికి డబుల్ ట్రబుల్**
**ప్రపంచమంతా ఇదే సీన్**

మహా : ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. కరోనా మహమ్మారి తర్వాత అత్యల్ప వడ్డీ రేట్ల కారణంగా భారీగా పుంజుకున్న ఈ రంగం, ఇప్పుడు కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచడంతో గడ్డు కాలం ఎదుర్కొంటున్నాయి. ఒకవైపు ఇళ్ల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా అధిక స్థాయిలోనే కొనసాగుతుండగా, మరోవైపు పెరిగిన వడ్డీ రేట్లు రుణ గ్రహీతలపై పెనుభారం మోపుతున్నాయి. దీనికి తోడు అమెరికాఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం, వడ్డీ రేట్ల కోతపై ఆశలను నీరుగార్చడంతో ఈ ఒత్తిడి మరింత కాలం కొనసాగేలా కనిపిస్తోంది. 2008 ఆర్థిక సంక్షోభం తరహాలో, రియల్ ఎస్టేట్ రంగంలోని మాంద్యం విస్తృత ఆర్థిక సమస్యలకు దారితీస్తుందేమోనని విధానకర్తలు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయంగా అనేక దేశాల్లో ఇళ్ల ధరలు తమ గరిష్ఠ స్థాయిల నుంచి కిందకు దిగాయి. అయినప్పటికీ, ఆదాయాలతో పోలిస్తే ధరలు ఇంకా చాలా ఎక్కువగా ఉన్నాయి. 2025 చివరి నాటి నివేదిక ప్రకారం,



హాంగ్‌కాంగ్‌లో 60 చదరపు మీటర్ల అపార్ట్‌మెంట్ కొనడానికి సగటు వ్యక్తికి 14 ఏళ్ల ఆదాయం, లండన్‌లో 12 ఏళ్ల ఆదాయం అవసరం. దీంతో నైపుణ్యం కలిగిన ఉద్యోగులకు కూడా సొంత ఇల్లు ఒక కలగానే మిగిలిపోతోంది. ఈ సంక్షోభం చైనాలో అత్యంత తీవ్రంగా ఉంది. ప్రభుత్వ విధానాల కారణంగా అక్కడ అతిపెద్ద డెవలపర్లు (ఎవర్‌గ్రాండే వంటివి) కుప్పకూలాయి. చైనాలో కుటుంబాల సంపదలో 70 శాతం గృహాల రూపంలోనే ఉండటంతో, గత ఆరేళ్లుగా కొనసాగుతున్న ఈ పతనం వినియోగాన్ని, ప్రజల సంపదను దెబ్బతీస్తోంది. ఇది 1990లలో జపాన్ ఎదుర్కొన్న ఆర్థిక సంక్షోభాన్ని గుర్తుచేస్తోందని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. అమెరికాలో మాంద్యం కాస్త నెమ్మదిగా ఉన్నప్పటికీ, ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ధరలు తగ్గాయి. 2019లో సగం ఇళ్లను కొనుగోలు చేయగలిగిన కుటుంబాలు, ఇప్పుడు కేవలం నాలుగో వంతు ఇళ్లను మాత్రమే కొనగలిగే స్థితిలో ఉన్నాయంటే అక్కడ కొనుగోలు శక్తి ఎంతగా దెబ్బతిన్నదో అర్థం చేసుకోవచ్చు.

భారతదేశంలోనూ ఈ రంగంలో మందగమన సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నైట్ ఫ్రాంక్ నివేదిక ప్రకారం, 2026 మొదటి త్రైమాసికంలో అమ్మకాలు 4% తగ్గాయి. ముఖ్యంగా రూ.1 కోటి లోపు బడ్జెట్ ఇళ్ల అమ్మకాలు బలహీనపడ్డాయి. అయితే, లగ్జరీ ఇళ్ల విభాగం మాత్రం కొంత బలంగానే ఉంది. దేశవ్యాప్తంగా అమ్ముడుకాని ఇళ్ల నిల్వలు పెరుగుతున్నాయి. ఈ నిల్వలను ఖాళీ చేయడానికి ఇప్పుడు సుమారు 6 త్రైమాసికాలు పడుతుండటం ఆందోళన కలిగించే అంశం.

# రాజకీయం కైలాసం ఆటలాంటిది

**హైదరాబాద్, మహా** : రాజకీయం కైలాసం ఆటలాంటిది.. మనం ఎంత మంచి చేసినా, ఒక్కోసారి పెద్ద పాము మింగేసి మళ్ళీ మొదటికే తీసుకొస్తుంది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యేలు సాయన్న, లాస్య నందిత చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లను కట్టినమని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక ఇండ్లు కూల్చుడు తప్ప.. కట్టుడు లేదని విమర్శించారు. రైతులకు యూరియా, కరెంట్ ఇచ్చే తెలివి లేదు.. కానీ రైతు డిస్కం పెడతాడట అని మండిపడ్డారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో.. రైతులపై రేవంత్ రెడ్డికి అంతే ప్రేమ ఉంటదని వ్యాఖ్యానించారు. రైతు డిస్కం పేరిట ఉచిత విద్యుత్ ఇస్తానంటే ఎవరు నమ్మరని అన్నారు. ఊళ్లలో కాంగ్రెస్‌ను నమ్మినందుకు గోసపడుతున్నారని తెలిపారు. ఎస్ ఐ ఆర్ పై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వాళ్లందరూ ఓటు ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలన్నారు. 2025 ఓటరు లిస్ట్ ప్రకారం మొత్తం 3.39 కోట్ల ఓట్లు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం పోలింగ్ బూతులు 35,985 ఉన్నాయని చెప్పారు. ఓటరు లిస్ట్‌ను కరెక్టుగా జల్లెడ పడితే హైరానా పడాల్సిన అవసరం ఉండదని కేటీఆర్ తెలిపారు. జూన్ 25వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు ఇంటింటి వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు. వారం తర్వాత డ్రాఫ్ట్ ఓటరు లిస్ట్ ప్రకటిస్తారని చెప్పారు. జూలై 31వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. నెల రోజుల పాటు వచ్చిన అభ్యంతరాలను స్క్రూట్నీ చేసి ఫైనల్ లిస్ట్‌ను ప్రకటిస్తారని చెప్పారు. 2026 అక్టోబర్ 1వ తేదీన ఫైనల్ లిస్ట్‌ను ప్రకటిస్తారని తెలిపారు.

# వైఎస్సార్ విగ్రహాల ధ్వంసంపై భగ్గుమన్న వైఎస్ షర్మిల

ధ్వంసం చేస్తుంటే, అధికార కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నంద్యాల జిల్లా శ్రీనివాస సెంటర్ వద్ద జరిగిన వైఎస్సార్ విగ్రహ ధ్వంస ఘటనను ఏపీ కాంగ్రెస్ పక్షాన ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ దాడులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి రాజకీయ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని ఆమె ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ విగ్రహాలపై జరుగుతున్న దాడుల పరంపరలో భాగంగా నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో పట్టపగలే ఓ సైకో విగ్రహంపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని షర్మిల మండిపడ్డారు. బహిరంగ ప్రదేశంలో ఈ ఘటన జరుగుతున్నప్పటికీ, అక్కడే ఉన్న పోలీసు యంత్రాంగం నిరోధించకపోవడం వారి వైఫల్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో మహానేత వైఎస్సార్ విగ్రహాలపై దాడులను అరికట్టాల్సిన పూర్తి బాధ్యత ప్రస్తుత కూటమి ప్రభుత్వానిదేనని ఆమె స్పష్టం చేశారు. నంద్యాలలో ధ్వంసమైన పాత విగ్రహం స్థానంలో తక్షణమే కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయించి తీరాలని షర్మిల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ నంద్యాలలో అదే శ్రీనివాస సెంటర్ వద్ద వెంటనే వైఎస్సార్ విగ్రహాన్ని అధికారికంగా పునరుద్ధరించకపోతే, అదే ప్రదేశంలో తాను ఆమరణ దీక్షకు దిగుతానని ముఖ్యమంత్రి చంద్రబాబుకు షర్మిల సంచలన హెచ్చరికలు జారీ చేశారు.

## దూరపు దగ్గరకు

అక్షరాల జాతర జరిగే నెలవు కదా
అక్కడ నేను తప్పక వుంటాననే వెళ్లావు
తీరా లేకపోయేసరికి నిరాశపడ్డావేమో

నేను ఇక్కడున్నాను మిత్రమా
అక్కడి లాంటి ఎన్నెన్నో చోట్లు తిరిగి తిరిగీ
కడకు ఇక్కడికి చేరాను, ఈ వాటికకు
ఈ పరిసరాల అద్దాలు తేటగా
నన్ను నాకు సహజంగా చూపుతుంటాయి
ఏ మాయా ఛాయలను అద్దకుండా
ఇక్కడ నా పలుకూ నా అడుగూ మలుపూ
నా వేడుకా వెల్లువా అచ్చంగా నావే.

ఇక్కడ ఎదురుగా ఒక మనిషి ఉన్నా
తరువు వున్నా పులుగు వున్నా అలుగు వున్నా
ఆనంద కాంతి ఒకేలా పరుచుకుంటుంది
ఒకో వేళలో అసలేదీ లేకున్నా
ఇక్కడ దిగులు చీకటి వాలనే వాలదు

వుండీ లేకుండా పోవడమనేది
ఇక్కడ లేనే లేదు
వుండడమంటే నిజంగా వుండడమే.

కుదిరితే ఇక్కడికి ఓ సారి రా .
నన్ను నేను ఎదురుగా చూసుకునే
అవకాశం కదా, అది నాకు కానుక.
అయితే అక్కడికి నువు నాకు
వేద్దామని తెచ్చిన పూల హారాన్ని
అక్కడే వదిలేసి రా.
ఇక్కడ దాని అవసరం వుండదని
వచ్చాక నీకూ తెలుస్తుంది.
ఒకప్పుడు నన్ను దగ్గరికి తీసుకున్న
చేతులతో చూపులతో వస్తావు కదా
అవి చాలు నాకు.

మెల్లగా చూసుకుంటూ రా.
ఇక్కడికి కాలి బాట తప్ప మరొకటి లేదు.
పాదాలు కష్టపడొచ్చు , అయినా మనసు అలసి
పోదు
దారిలో పెద్దగా సందడి వుండదు కానీ
ఒంటరి నడక అనిపించదు

ఏ నకళ్ల ఆనవాళ్ళూ లేని
ఇక్కడికొచ్చి ఇక్కడిని నాతో కలిపి చూసి
నాలుగు మాటలు మాట్లాడుతావు కదా
మాటలతో పాటు నీ మౌనాన్నీ వినాలని ఉంది,
ఈ పరిసరాలతో కలుపుకుని.
రావోయీ, కుదిరితే.



దర్భశయనం శ్రీనివాసాచార్య
94404 19039

## వాసా ఫౌండేషన్ - పాలపిట్ట సంయుక్తంగా నిర్వహించిన వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ - 2026 ఫలితాలు...

1. మొదటి బహుమతి వేరు పురుగు గజ్జెల రామకృష్ణ
2. రెండో బహుమతి కాయకమే కైలాసం పిన్నంశెట్టి కిషన్
3. మూడో బహుమతి రండి... కలుసుకుందాం ఈతకోట సుబ్బారావు

ఎనిమిది మంది కవితలకు ప్రత్యేక బహుమతులు
1. నాంపల్లి సుజాత
2. కృష్ణవేణి పరాంకుశం
3. గట్టు రాధిక
4. దేవకి మహాసముద్రం
5. దాకరపు బాబూరావు
6. అవ్వారు శ్రీధర్ బాబు
7. రహీమొద్దీన్
8. లేదాళ్ళ రాజేశ్వరరావు

కవితల పోటీలో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానోత్సవం 6 జూన్ 2026 సాయంత్రం 6 గంటలకు నాంపల్లి లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం లో జరిగే వాసా ప్రభావతి జయంతి సభలో వుంటుంది.

-పాలపిట్ట బుక్స్

# పోటీలు, బహుమతులు, ప్రతిభకు గుర్తింపుగా అవార్డులు, అర్హతలు

**వివిధ ప్రక్రియలకు చెందిన రచనలను, గ్రంథాలను పరిశీలించి 'ఉత్తమ'మైన వాటికి ప్రతియేటా పురస్కారాలు ప్రదానం చేసే సంస్థలు మనకు చాలానే వున్నాయి. విశ్వవిద్యాలయ పీఠాలు, పరిషత్తులు, అకాడెమీలు తమ విధ్యుక్త విద్యావిషయక కార్యాచరణ లేదా నిర్దేశిత లక్ష్యాలలో భాగంగా సాహిత్య పురస్కారాలకు నిధులు కేటాయిస్తాయి. ఇవి కాక సొంత ఖర్చుతోసాహిత్యసేవా కార్యక్రమాలు నిర్వహించే అనేక ఇతర ప్రైవేటు సంస్థలున్నాయి ; వీటిలో కొన్నిసంస్థల సంకల్పం, అవి ఇస్తున్న 'స్మారక' పురస్కారాలు - అయిదున్నర దశాబ్దాల కిందట స్థాపితమైన నూతలపాటి గంగాధరం సత్కారం మొదలుకుని అయిదేళ్ళ క్రితం నెలకొల్పిన పీచర సునీతారావు పురస్కారం వరకు- ప్రత్యేకంగా ప్రశంసించదగ్గవి.**

కీర్తిశేషులైన వ్యక్తి స్మరణలో ప్రదానం చేసే ఈ తరహా అవార్డుల వెనుక, భౌతికంగా దూరమైన ప్రియబంధువు పట్ల ఆ కుటుంబ సభ్యులగాఢ ఆదరాభిమానాలు, ఆ వ్యక్తిని నిత్యం జ్ఞాపకాలలో నిలుపుకోవాలన్న ఆకాంక్ష, తపన వున్నాయి. ఈ కోణంలో ఇలాంటి సంస్థల భావోద్వేగపూరితమైన ఆశయం ఉన్నతమైనది, ఉదాత్తమైనది కూడా.గత ఆదివారం రవీంద్రభారతి, మినీహాల్ లో జరిగిన పీచర సునీతారావు ఐదవ స్మారక వార్షిక సాహిత్య పురస్కార ప్రదానోత్సవసభలో పలువురు సాహితీ ప్రముఖులు ఈ విషయాన్ని ఉద్ఘాటించారు.

ఇంకా, వక్తల ప్రసంగాలలో, అవార్డులకు అర్హుల ఎంపిక, న్యాయనిర్ణేతలు పరిగణనలోకి తీసుకునే అంశాలు, రచనని పరిశీలించే విధానం, ప్రతిభకి అవార్డుకి మధ్య సంబంధం, రచయిత/కవి ప్రతిభకి గుర్తింపు...తదితర విషయాలు ప్రస్తావన కొచ్చాయి. వీటిపై నా అభిప్రాయాలు కొన్ని క్లుప్తంగా ఇక్కడ చర్చించాలనుకుంటున్నాను.

అవార్డుల ద్వారా సాహిత్యకారుడికి పేరు, గుర్తింపు వస్తాయన్నది వాస్తవం. అయితే అవార్డు ప్రతిభకు కొలమానం కాదు, ఎందుకంటే ప్రతిభావంతులు కానివారికి కూడా అవార్డులు వచ్చాయి, అదీ ప్రతిష్టాత్మక సంస్థల నుంచి .. అనేది కొందరి వాదన. ఇందుకు వారు అనేక సందర్భాలను ఉదహరించగలరు. కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డుల విషయంలో సైతం ఈ ఆరోపణ వుంది. సాధారణంగా ఏ సాహితీ సంస్థ అయినా అవార్డు(ల) కోసం నిర్ణీత కాలవ్యవధిలో ప్రచురితమైనగ్రంథాలను ఆహ్వానించి, వచ్చిన ఎంట్రీలను తోచిన పద్ధతిలో వడబోశాక షార్ట్ లిస్ట్ ని న్యాయ నిర్ణేతల ప్యానెల్ కి ఇచ్చి కనీసం 1 5 వరకు ర్యాంకింగ్ ఇవ్వమంటుంది. ప్యానెల్ లో విషయ నిపుణులైన(సంస్థ దృష్టిలో) ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులుంటారు, వారు వేర్వేరుగా ఇచ్చే ర్యాంకింగ్ లను సహసమన్వయించి, సమీక్షించి, అవార్డుకి అర్హమైన గ్రంథా(లని)న్ని ఎంపిక చేయడం జరుగుతుంది. కథలు, కవితలు, ఇతరాలకు బహుమతులిచ్చే సంస్థలు, పత్రికలు ఇదే పద్ధతి అవలంబిస్తాయనుకోవచ్చు. ఉన్నంతలో ఇదే శాస్త్రీయ పద్ధతి.

అయితే చాలా సంస్థలు, పత్రికలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన వారి పేర్లు బహిర్గతం చేయవు. (గతంలో ఒకటి రెండు ప్రముఖ పత్రికలు న్యాయనిర్ణేతలపేర్లు, వారి కామెంట్స్ ప్రకటించేవి. ఇప్పుడా రివాజు పోయింది.) కాబట్టి ఏ అర్హతలున్న' నిపుణులు' ఏ ప్రామాణికతల ఆధారంగా ర్యాంకింగ్ లు ఇచ్చారో , తుదకి ఉత్తమ గ్రంథాన్ని/ రచనని ఎలా ఎంపిక చేశారో మనకు తెలిసే అవకాశం లేదు. ఒక్కొక్కసారి ప్రముఖ సంస్థలు, అకాడెమీలు ఇచ్చే అవార్డులు మనల్ని విస్మయ పరుస్తాయి; రచన మెరిట్ (సాహిత్య విలువ)/గ్రంథకర్త ప్రతిభ కన్నా సాహిత్యేతర కారణాలు - అంటే వ్యక్తిగత సంబంధాలు, ఇతర ప్రాధాన్యతలు, కొన్నివర్గాల ఒత్తిళ్ళు అవార్డు కమిటీల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయన్న అభిప్రాయానికి ఆస్కారమిస్తాయి.కొన్ని సంస్థలిచ్చేఅవార్డుల విషయంలో, కొన్ని సందర్భాల్లో, అవార్డు కమిటీలోని సభ్యుని ప్రత్యుపకార వైఖరి అర్హుడు ఎవరో నిర్ణయిస్తుంది. ఇది mutual back scratching అన్న మాట. మరో రకంగా ఆలోచించే వారూ వున్నారు : ఒక ప్రముఖ దినపత్రిక నిర్వహించిన కథలపోటీకి న్యాయనిర్ణేతగా వ్యవహరించిన ఒక ప్రసిద్ధవ్యక్తి, 'బహుమతులు నిర్ణయించేటప్పుడు సామాజిక సమన్యాయం కోణంలో కూడా చూస్తాను' అని బాహాటంగానే అన్నారు.ఎంపికైన కథలకి పెద్దమొత్తం లోనే నగదు బహుమతులిస్తారు వీళ్ళు. కానీ 'సింగినాదం జీలకర్ర సామెత లాగా వుంది ఇది ' అని కొందరు సీనియర్ రచయితలన్నారు.

నిర్దిష్ట ప్రామాణికత(standards)ల ఆధారంగా వస్త్వాశ్రయిక కోణంలో రచనల 'మెరిట్' ని మదింపు చేసి బహుమతులకు సిఫార్సు చేయడంలో నిక్కచ్చిగా వ్యవహరించే సాహిత్యకారులూ వున్నారు. (అనువర్తింప జేసే standards వారివారి భావజాలం, సాహిత్య అధ్యయనం, అవగాహనని బట్టి, మెరిట్ కి వాళ్ళిచ్చే నిర్వచనాన్ని బట్టి వుంటాయి.) ఈ విషయమైనా అనుభవాలు నాల్గింటిని ప్రస్తావిస్తాను. 'తానా నవలల పోటి 2017'కి న్యాయనిర్ణేతల్లో ఒకడిగా షార్ట్ లిస్టెడ్ 16నవలలు చదివి వాటిపై నా కామెంట్స్ సహా ర్యాంకింగ్ ఇచ్చాను; మొదట్లో కొంచెం విభేదించినా, కొంత చర్చ తర్వాత, మరో న్యాయనిర్ణేత, తానా తరఫు స్థానిక ప్రతినిధి... నా పాయింట్స్ తో ఏకీభవించారు; తానా వారు అప్పుడు బహుమతి మొత్తాన్ని మొదటి మూడు నవలలకు పంచారు. 'తెలంగాణా సాహిత్య అకాడెమి నవలల పోటి 2019' కి న్యాయనిర్ణేతల్లో ఒకడిగా 34 నవలలు చదివి, వాటిలో ఏదీ రెండు లక్షల రూపాయల బహుమతికి అర్హమైనది కాదని తేల్చేసి, అయిదు నవలలని ఎంచి ఒక్కోదానికి యాభై వేల రూపాయల ప్రోత్సాహక బహుమతి ఇవ్వొచ్చునని సూచించాను, మరో ఇద్దరు న్యాయ నిర్ణేతలు నా వాదనతో కన్విన్స్ అయ్యారు, అప్పటి డైరెక్టర్ మా సిఫారసుని ఆమోదించారు. రామోజీ ఫౌండేషన్ వారి 'కథావిజయం2020' కి, 'కథావిజయం2021' కి న్యాయనిర్ణేతలలో ఒకడిగా వందల కథలు చదివాను; రెండు తడవలూ వారు ప్రకటించిన పెద్ద మొత్తం బహుమతికి అర్హమైన కథలు కనిపించనందున, 15 కథల్ని ప్రత్యేక బహుమతికి, 10 కథల్ని ప్రోత్సాహక బహుమతికి ఎంపిక చేసి,అదే మా సమిష్టి నిర్ణయమనినాతొ పాటు మరో నలుగురు పానెల్ సభ్యులం సంపాదకవర్గానికి తెలియజేశాం, వారు అంగీకరించారు. ఖమ్మం ఈస్తెటిక్స్ కథలపోటి 2024సందర్భంగా నాకు 62 కథలు పంపించారు ; నా కోణంలో పరిశీలించి మొదటి పదింటికి ర్యాంకింగ్స్ ఇస్తూ కామెంట్స్ రాశాను. మరో ఇద్దరు న్యాయ నిర్ణేతలు నాతొ దాదాపు పూర్తిగా ఏకీభవించారని నిర్వాహకులు నాకు చెప్పారు,prerogative గా మూడు మార్పులు చేసి మా సిఫారసుని యథాతథంగా స్వీకరించారు.

సమకాలీన సమాజం తీరుతెన్నులను, జీవన సంక్లిష్టతని ప్రతిబింబించడం సాహిత్యం విధి. సమాజ చలన సూత్రాల పట్ల సరైన అవగాహన, తన చుట్టూ జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలించగల దృష్టి, సాటి మనుషుల పట్ల సానుభూతి, సహానుభూతి, జీవన సంక్లిష్టతకు భాష్యం చెప్పగలిగే శాస్త్రీయ దృక్పథం, మానవ జీవితాన్ని ఒక తాత్విక దృక్కోణంలోంచి విశ్లేషించగల సామర్థ్యం ...ఇవి వున్న రచయిత రచనల ద్వారా సమకాలీన సమాజ తీరుతెన్నులపై వ్యాఖ్యానించడం తన బాధ్యత గా స్వీకరిస్తాడు. అలా వ్యాఖ్యానించే క్రమంలో మనిషి జీవితంలోని నిర్దిష్ట వైరుధ్యాలపై, మనస్తాత్విక విరోధాభాసలపై, నైతిక మీమాంసల పై వెలుగు చిమ్మే ప్రయత్నం చేస్తాడు. శరవేగంగా వచ్చి పడుతోన్న మార్పుల కారణంగా జీవన సంక్లిష్టత పెరుగుతున్నాకొద్దీ కొత్త అర్థాలు సంతరించుకుంటున్న విలువలు, ఆదర్శాలు, సిద్ధాంతాలు, మానవ సంబంధాలను విశ్లేషించి, పలు పరిణామాల కార్యకారణ సంబంధాన్ని సూచ్యంగా స్ఫురియింపజేసి, సమాజానికి ఒక ఆలోచన అందిస్తాడు. రచయిత దృష్టి ఎంత నిశితంగా వుంటే ఎంచుకున్న కథావస్తువులో అంత తాజాదనం గుబాళిస్తుంది. అతని దృక్పథం ఎంత ప్రగతి శీలంగా వుంటే కథ /నవలలోని విలువల ప్రతిపాదన, అంతర్లీన సందేశం అంత ఉదాత్తంగా వుంటుంది. అతనికి శిల్పంపై, కథన నైపుణ్యం పై ఎంత పట్టు వుంటే కథ / నవల అంత ప్రశస్తంగా, ఆలోచనాస్ఫోరకంగా వుంటుంది. కథ, నవల, కవిత, నాటకం ... ప్రక్రియ ఏదైనా కానివ్వండి మొత్తంగా సాహిత్యంలో ఉత్తమ విలువలు, ఉన్నత ప్రమాణాలు పాదుకోవాలని మనం కాంక్షిస్తున్నట్లయితేఒక రచన మెరిట్ ని అంచనా కట్టేటప్పుడు కచ్చితమైన ప్రమాణాలు పాటించ వలసిందే. పురస్కారాలకు, బహుమతులకు రచనల్నిపరిశీలించేప్పుడు రాగద్వేషాలకు లోను కాకూడదు, పక్షపాతంతో వ్యవహరించకూడదు అని నా సిద్ధాంతం.

న్యాయనిర్ణేతగా వ్యవహరించే సందర్భాల్లో ఒక రచన - ముఖ్యంగా కథ - మెరిట్ ని మదింపు చేసేందుకు నేను సాధారణంగా అయిదు అంశాలను పరిగణనలోకి తీసుకుంటాను. కథావస్తు వర్తమానత, వినూత్నత ; ఎత్తుకున్న సబ్జెక్ట్ పై రచయిత అవగాహన, దృక్పథం; అతని/ఆమె దృక్పథం లోని ప్రగతిశీలత; ఆకట్టుకునే ఇతివృత్త నిర్మాణం; కథ ద్వారా అంతిమంగా పాఠకునికి అందే కమ్యూనికేషన్.



-ఆడెపు లక్ష్మీపతి
మొబైల్ :970122720 7

### పలమనేరులో జూన్ 7 న కవియాకూబ్‌కు 2025 - సృజన సాహితీ పురస్కార సభ

పలమనేరు సృజన సాహితీ పురస్కారం* 2025 ను ప్రముఖ కవి, కవిసంగమం నిర్వాహకులు యాకూబ్ కు పలమనేరు కళా మందిరంలో జూన్ 7వ తేదీ ఆదివారం జరిగే సాహితీ కార్యక్రమంలో అవార్డు ప్రదానం ఉంటుంది. ఈ సభలో యాకూబ్ సాహిత్యప్రస్థానం గురించి కవి సీతారాం, సాహిత్య వ్యక్తిత్వం గురించి కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు ప్రసంగిస్తారు.

కవియాకూబ్ "ప్రవహించే జ్ఞాపకం, సరిహద్దురేఖ, ఎడతెగని ప్రయాణం, నదీమూలంలాంటి ఆ ఇల్లు, తీగలచింత, మనుష్రా మనుషులు!" ఆరు కవితా సంపుటాల ద్వారా సమాజానికి అవసరమైన హెచ్చరికలాంటి, సృజనాత్మకమైన కవిత్వాన్ని వెలువరించారని నిర్వాహకులు తెలిపారు.

సభా నిర్వాహణ :
- పలమనేరు బాలాజి ,
9440995010,

& పి.తులసీనాథం నాయుడు
పలమనేరు రచయితల సంఘం, చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, పలమనేరు, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

### చెట్టు

చెట్టుకావడం
రక్తం లేని శరీరంలా
ఆకులు లేని చెట్టు
జీవితాంతం
ఎన్నెన్ని కనుమరుగవుతున్నా
ఎన్ని పక్షుల తోడో
జీవించడంలో బాధ కంటే
గొప్ప బాధ లేదని
జీవితం కంటే
లోతైన దుఃఖం
స్వీయఅవగాహనేనని
ఎన్నిసార్లుఅనుకుందో
ఎటు నుంచి
ఎటు పరుగోతెలియక
అంత్యక్రియలకుఎదురుచూసే
దాని కలప బాధనిఅనుభవించలేక
రోజుల తరబడి
సహనంగా ఉండే
చెట్టు కావడం
ఎంతవిషాదమో

ముకుంద రామారావు
990 834 7273

# కవిత్వ మరకతమణి

కొన్ని కవితలు చదివాక మాటలుండవు. ఆ భావనలో ఒదిగి ఉండడమే మిగులుతుంది. అలాంటి కవిత చదివాక మొలిచిన
అనుభూతులే ఈ వాక్యాలు.

రఘు గారి కవిత్వం మనసు మూలల్లో జరిగే నిశ్శబ్ద ప్రయాణం. దానిని పంచుకోవాలనిపించి చేసిన ప్రయత్నమిది.

మూడు నెలల క్రితం నన్ను చేరిన ఆరు పుస్తకాలలో మూడు *దిశాంతర స్వప్నం*, *లిపి తడిసిన తరుణం*, *అసంకల్పిత పద్యం*. అవి కేవలం కవిత్వ పుస్తకాలుగా కాదు, ఒక్కో అనుభూతిలా నా రోజుల్లో కలిసిపోయాయి. 'దిశాంతర స్వప్నం'లో మనసొక లాలిత్యాన్ని అనుభవించే తపన కనిపించింది. కనపడని అంచుల్ని వెతుకుతూ వెళ్లే అంతర్ముఖ ప్రయాణంలా అనిపిస్తుంది. 'లిపి తడిసిన తరుణం'లో భావాలే మాటల్లా చిందినట్టుంటాయి. కాగితంపై మీదవి మెరుపుల్లా తొణుకుతాయి. మరి 'అసంకల్పిత పద్యం', అది నిజంగా హృదయాన్ని తాకే అసంకల్పిత సంభూతి.


రఘు శేషభట్టార్ గారి కవిత్వం అలంకారాల ఆర్భాటంతో విసిగించదు, అంతరంగ నిశ్శబ్దంలో దీపంలా వెలుగుతుంది.

' గుబులు ' అనే పేరుతో రాసిన ఈ పద్యం చూడండి
"గుబులెందుకు పుడుతుందో కానీ
అది కాండం తొలిచే పురుగులా కుట్టినప్పుడు
మనం ఇష్టంగా చేసే పనులు కూడా విసుగనిపిస్తాయి
ఒక తెలియని నస లోలోపల దూరి
స్థిమితంగా ఉండడం వీలుకాదని చెబుతుంది "

ఇది చదివాక హృదయ స్పందనే గుబులు గుబులుగా వినబడినట్టుంటుంది. తెలియని కారణమేదో లోలోపల కదిలి మనల్ని వినాలనిపించేలా చేస్తుంది. గుబులొక చలనమౌతుంది.

కవిత్వం మీద ఆయన పరిభాష వినండి
కవిత్వం ఏదీ రాయలేదంటే
ఆత్మ నీతో మాట్లాడలేదని అర్థం లేదా
ఆత్మ పరిభాషను నువ్వు పట్టించుకోలేదని అర్థం
ఏక కాలంలో నువ్వు మనిషిగా
నీ లోచూపొకటి వ్యాఖ్యాతగా వున్నప్పుడు
కవిగా నిలబడతావని ప్రపంచాన్ని జల్లెడ పడతావని
తెలుసుకుంటావు
సృజనలో నీ కళ్ళు జ్ఞానకాంతితో తడిసినట్టుంటాయి

"అంకురం" అనే ఈ కవితతో తనలోని మనిషి, కవి ఒక్కసారే మేల్కొంటారు. ప్రపంచాన్ని జల్లెడ పడతారు. కవితాత్మకంగా రాయడం సరే, కానీ సాధారణ క్షణాన్ని కవిత్వంగా మార్చడం కూడా ఉంది తనలో. ప్రతీ రోజువారీ సంఘటనలో ఒక అంతర్లీన తత్త్వాన్ని గుర్తించి, దానిని క్లుప్తంగా చెప్పడం ఈ కవి ప్రత్యేకత. చిన్న భావాన్ని పెద్ద అలంకారాల్లో ముంచేయకుండా, ఎంత అవసరమో అంత మాత్రమే చెప్పి వెళ్ళిపోతారు. ఆ నియంత్రణే ఈ కవిత్వానికి మెరుగు. ఏ ఒక్క




పదం అదనంగా అనిపించదు. ఒక్క పాదం కూడా మించిపోదు.చదివిన క్షణంతో ముగిసిపోదు, లోపల ఇంకో తలుపు తెరుస్తుంది.అదే ఇతని కవిత్వ స్వభావం. కొన్ని పంక్తులు ఏ పనిలో ఉన్నా గుర్తుకొస్తాయి. మనసు మూలల్లో మిగిలి మెల్లగా పలుకుతూనే ఉంటాయి.

విమల గంధర్వాల జడివానలో తడిసినవాడ్ని
ఉత్త తడి చెమ్మల ఛాయలో తల దాచలేను
మాయ చేతనల జల్లెడలో తరళ ధూళై రాలలేను
(ప్రణవధ్వని )

ఇందులో కవి ఆత్మతో సంభాషించినట్టుంటుంది.
రాతి ఫలకం మీద రాసిన శాసనమేదో వెతికినట్టు
గాలిపొరల్లో గువ్వల సందేశమేదో దాచినట్టు
ఒక జీవన తంత్రమేదో పిల్లలకివ్వాలని వస్తాను
వాళ్ళు ఇవాళనే ఉయ్యాలమీద రేపటి లోకాన్ని
ఊపుతారు
(అసంబద్ధ కోరిక )

ఇందులో పిల్లల నెపంతో మనిషి తపన సహజంగా వినిపిస్తుంది.

ఇలా ప్రతి కవిత ప్రశ్నలా మొదలై, ఒక పరిణిత అనుభూతిగా ముగియటం చూస్తాం. రఘు గారి కవిత్వం చదవడం అంటే పదాలు చదవడం కాదు. మనసుతో మాట్లాడుతూ చేసే ప్రయాణం. ఆ ప్రయాణంలో కొన్నిసార్లు తెలియని దిగులు,ఒక తెలియని తపన, తుదకొక ప్రశాంతత ఆవిరించి అందాకా
కమ్ముకున్న మాటలకొక కొత్త అర్థం స్ఫురిస్తుంది.

ఆభరణాలన్నీ ముందుంచినట్టే ఒక్కో పుస్తకం ఒక్కో మరకతమణి. ఆ మెరుపు బయటకే కాదు లోపలికీ పాకుతుంది.చదివాక మనసు కొద్దిగా మౌనంగా మారుతుంది.

మిగతా మూడు పుస్తకాలు *మోహధూపం*, *అనల్పం*, *సౌరభం* భిన్న భావాల సమాహారం. ఇందులో సౌరభం " వ్యాస సంపుటి.

రాత్రి ఒక నక్షత్రాల పుట్ట !
చీకట్లు దాక్కుంటాయ్
నా అరచేతుల కొమ్మల్లో వాక్యాలు చిక్కుకుంటాయ్
నాకూ రాత్రికి మధ్య నెలవంక కవ్వంలా మారుతుంది

"మోహధూపం" లోని ఈ కవిత చాలా మృదువుగా, మనసుకు హత్తుకునేలా ఉంటుంది. రాత్రినొక సజీవమైన స్నేహితలా చూపిస్తూ, ఒక మృదువైన అనుభూతిని వెలికితీసే ప్రయత్నం కనిపిస్తుంది. తద్వారా అంధకారంలో కూడా ఒక ప్రశాంతత, ఓదార్పు ఉంటుందని సున్నితంగా చెబుతారీ కవి .

" దారుల్లో బురదున్నా హృదయంలో మధువున్న వాడే కవి. వాడి కోపాలు కొవ్వొత్తుల్లా లోకం కోసం వెలుగుతాయ్... "

అంటూ "అలరించే తన వాక్యం ఒక బాధాంతర భృతి!" అంటారు. బాధే కవిత్వానికి "ఆహారం" (భృతి) లాంటిది. ఈ కవి ఏ తత్వాన్ని రాసినా, లోలోపల బాధ ఒకటి ఉంటుంది. అదే తన కవిత్వానికి మూలం. అలా రఘు గారిది చిక్కని కవిత్వం. అన్నీ సమపాళ్ళలో కలిసిన రస రమ్య కావ్యం.

*సౌరభం* వ్యాస కదంబంలో ఏళ్లెన్ని గడచినా నోళ్లు మర్చిపోనప్పుడే అది గొప్ప కవిత్వం అని నమ్ముతాన్నేను అని
వ్యాఖ్యానిస్తారు రఘు. నిజానికిది తన కవిత్వానికి సరిగ్గా ఇమిడే మాట. సౌరభంలో తను దగ్గరైన యుగకవి శేషేంద్రను పలవరిస్తారు. వారి పిల్లల కవిత్వాన్ని, ఇతర విస్మృతకవులను పరిచయం చేస్తారు. తన మనసుకు, కవిత్వానికి చేరువైన కవులెందరినో వ్యాస సౌరభంతో మనకు దగ్గర చేశారు. ఉత్తమ కవులంటూ వేరేగా ఉండరు. హితం కోరుతూ యోగుల్లా మన మధ్యే ఉంటారంటూ, సాహితీ లోకంలోని తెంపరితనాలను,
" మహా వృక్షాలకు నీరు పోసి లేత మొక్కలకు ఎడారి చూపే ఆటవిక న్యాయం " వంటి గుణాలను విప్పి చెబుతారు. ఎన్నో
సందర్భాలు దృశ్యమానం చేస్తారు.

కాళిదాసును పలవరిస్తూ పేలవమైన పొడి వచనం చదివినప్పుడల్లా, పూర్వ కవుల కావ్యాలతో ప్రాయశ్చిత్తం చేసుకుంటానంటారు.

కవిత్వం ఏ రూపంలో ఉన్నా దాన్ని ప్రస్తుతించటంలో తనకు అంతులేని తృప్తి ఉంటుంది. అక్షరాలకు శాశ్వతత్వం ఇస్తూ నిలిచే నిఖార్సైన వాక్యం *రఘు శేషభట్టార్* గారు. వారి కవిత్వం గురించి నేనెంత చెప్పినా ఎంతో కొంత మిగిలే ఉంటుందనేది వాస్తవం. తన కవిత్వం చదువుతుంటే మృదువైన ఆనవాళ్ళేవో సాహిత్యంతో దొరికినట్టయ్యింది.ఇన్నాళ్ల నుండి వెతికేదేదో దొరకబుచ్చుకున్నట్టుంది. వారి విద్వత్తుకు , కవిత్వ తేజస్సుకు సరి ఎవ్వరు?




- జయసుధ కోసూరి
9010411955

(జూన్ 1వ తేదీప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం)

## చిరిగిన పుస్తకం !

నిన్న పుస్తకం చదువుతున్నప్పుడు,
ఒక స్నేహితుడితో మాట్లాడుతున్నట్లుగా ఉండేది
అనేక ప్రశ్నలు, అనేక సందేహాలతో
చర్చలు ఒక వాస్తవాన్ని గ్రహించడానికి సాగాయి.
తెలుసుకున్న సంగతులను సమీక్ష రూపంలో
సాహితీ పిపాసులకు ప్రసాదంగా పంచడం
నిన్నటి జ్ఞాపకాల మధ్య మిగిలిన అనుభవం.
చదవాల్సిన పుస్తకం అనుకోని అతిథిలా ఎదురైతే,
కళ్లు చెమ్మగిల్లాయి; మనసు వేదనతో వికలమైంది.
ఆ పుస్తకం పుటలు పిగిలిపోయిన సమాధానంలేని
పొదుపు కథలా
చెదలు చదివేసిన కాగితాలు, రంగు వెలిసిన
ముఖంతో వెక్కిరిస్తే
ఆ కథలో తర్వాత భాగం "ఇంకా ఉంది" అన్న
ట్టుగా...
కుటుంబ నేపథ్యంతో నడిచిన
మధ్యతరగతి జీవిత చిత్రాలు
కొత్త దారులు తొక్కడంతో అభ్యుదయం అలసిపో
యిన ముఖచిత్రాలు
అర్థం కాని అయోమయం మధ్య జీవన నడకలు
ఎవరి చిరునామా వారిదే
అన్నట్టుగా బంధాలు విడిపోతాయి.
కుటుంబం అనే పుస్తకాన్ని
ఎన్నిసార్లు అతికించాలనుకున్నా,
అతుకు అతుకుగానే మిగిలి,
మనసులు కలవని స్థితి.
అక్షరాలు వెలిసినట్టే మనుషులు వెలిసిపోతున్నారు.
ఇప్పటి జీవన సిద్ధాంతం ఆర్థిక లెక్కల బంధీఖానా;
"కలసి ఉంటే కలదు ఖర్చు" అంటున్నారు.
ఎవరి దారిలో వారు ప్రయాణం మొదలైన తర్వాత,
తల్లిదండ్రులు అనాథలుగా మిగిలిన శేషం...
ఇంటికి గోడలు ఉంటాయి,
కానీ ప్రేమకు ఆశ్రయం ఉండదు.
తల్లిదండ్రులు ఒంటరి అనాథలు నేడు
మన విజయాల వెనుక మౌనంగా నిలిచిన ప్రేమ,
మన బాల్యాన్ని నడిపిన తొలి స్పర్శ.
కానీ మనమే ఆ ప్రేమ పుస్తకాన్ని మూసివేశాం.
ఆత్మీయతలు మరచిన వర్తమాన సందర్భాలు
అభిప్రాయ బేధాలు, అరమరికలతో
పెద్దవారిని వెలివేస్తే, జీవితం మనల్ని
నిశ్శబ్దంగా వెలివేస్తుంది.

**బొల్లిముంత వెంకట రమణా రావు**



బొల్లిముంత వెంకట రమణా రావు
9347592054

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946



# నవ లిమిటెడ్ కు "హైదరాబాద్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సి ఎస్ ఆర్ అవార్డు"

- ఆనందంలో ఉద్యోగులు కార్మికులు సిబ్బంది

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**:ఈనెల 30వ తేదీన హైదరాబాద్ లో ఐటీసీ కాకతీయ వేదికగా జరిగిన "హైదరాబాద్ మేనేజ్మెంట్ 202526 సి ఎస్ఆర్ అవార్డును" ముఖ్యఅతిథి త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి, గౌరవ అతిథి జడ్జ్ హై కోర్ట్ ఆఫ్ తెలంగాణ ఎస్.నంద చేతులమీదుగా "నవ లిమిటెడ్" ప్రతినిధులు కంపెనీ సెక్రెటరీ వైస్ ప్రెసిడెంట్ వి.ఎస్.ఎన్.రాజు, సి ఎస్ ఆర్ మేనేజర్ సిహెచ్.శ్రీనివాసరావు, సోషల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు అందుకున్నారు. నవ లిమిటెడ్ సామాజిక సేవలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్యం విద్య జీవనోపాదులు ఇతర కార్యక్రమాల ద్వారా అభివృద్ధికి 'నవ లిమిటెడ్' చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డు దక్కిందని వైస్ ప్రెసిడెంట్ యూనిట్ హెడ్, తెలంగాణ ఆపరేషన్, రేర్ అడ్మిరల్ ఎల్వి శరత్ బాబు(వి) తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం.ఎ ప్రెసిడెంట్ ఎ.దేవేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎమ్.శరత్ చంద్ర, సెక్రటరీ శ్రీనివాసు దేవన్, ట్రెజరర్ సి.రమేష్ లక్ష్మణ్, జాయింట్ సెక్రెటరీ ఎస్.నందన తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం పెద్దపీట

- * మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- * రూ.5.20 కోట్లతో కొండాపురం–పొన్నెకల్లు రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన
- భద్రాద్రి బ్యూరో, మహా:



ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని ముందుకు సాగుతోందని తెలంగాణ రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం కొండాపురం గ్రామంలో రూ.5.20 కోట్ల వ్యయంతో పొన్నెకల్లు నుండి కొండాపురం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎంపీ రామసహాయం రఘు రాంరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ లతో కలిసి ఆయన ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులున్నా హామీలను అమలు చేస్తున్నట్లు చెప్పారు.

సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూనే రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారుల నిర్మాణం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఉపయోగపడుతుందని, కొండాపురం-పొన్నెకల్లు రోడ్డు పూర్తయితే ఈ ప్రాంత రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

**రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ..**

రైతును రాజు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల మేర(రెండు లక్షల రూపాయల వరకు) రైతు రుణమాఫీ చేశామని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి బాధ్యత ముగించుకుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అన్ని రకాల పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని చెప్పారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా అందజేస్తున్నామని తెలిపారు.

**నేటి నుంచే ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత..**

పేదలకు పక్కా గృహాలు అందించే ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత మంజూరు ప్రక్రియ సోమవారం నుంచే ప్రారంభం కానుందని మంత్రి వెల్లడించారు. ఈ విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నాలుగు విడతల్లో రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే మంజూరైన 4.50 లక్షల ఇళ్లకు సంబంధించి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి రెండేళ్లలోనే 72 వేల మంది నిరుద్యోగ యువతకు నియామక పత్రాలు అందించామని మంత్రి తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల జారీ, రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, ఆర్‌డీఓ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# చెలకాని వెంకన్న యాదవ్ కు సన్మానం

- పాల్గొన్న రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు
- డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

**యాదాద్రి భువనగిరి, మహా** : తెలంగాణ రాష్ట్ర యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా రెండోసారి గెలిచిన చలకాని వెంకన్న యాదవ్ కు శనివారం రాత్రి భువనగిరిలోని ఉద్యోగుల విశ్రాంతి భవనం లో ఘనంగా సన్మానం చేశారు యాదాద్రి భువనగిరి జిల్లా విద్యావంతుల వేదిక అధ్యక్షులు కొత్తపల్లి ఆనంద్ యాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యావంతుల వేదిక బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా గతంలో కొందరికే పరిమితం అయ్యేది. కానీ అందరికీ అవకాశం రావాలని చలకాని వెంకన్న యాదవ్ పోటీ చేసి గెలుపొందడం చాలా గొప్ప విషయం అని అన్నారు. సన్మాన గ్రహీత, యాదవ్ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు చెలకాని వెంకన్న మాట్లాడుతూ విద్య, ఉద్యోగం, రాజకీయం చైతన్యం కోసమే తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాజకీయాలకతీతంగా యాదవులను ఎమ్మెల్యేలు ఎంపీలు చేయడం లక్ష్యమని, యాదవులకు రాజ్యాధికారం ధ్యేయంగా ఈ సంఘం పని చేస్తుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదవ విద్యావంతుల వేదిక నూతన అధ్యక్షులు తోటకూర యాదయ్య యాదవ్ , గుండె బోయిన అయోధ్య యాదవ్, సింగన బోయిన మల్లేశం యాదవ్, శెట్టి బాలయ్య యాదవ్, నరాల వెంకట స్వామి యాదవ్, మంటిపల్లి సతీష్ యాదవ్, పాక జహంగీర్ యాదవ్, వేల్పుల వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

కారేపల్లి, మహా : కారేపల్లి లో సుమన్ ఐ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్(టోని) ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కారేపల్లి పరిసర ప్రాంత ప్రజలు ఈ శిబిరం సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ వైద్య శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందజేశారు. కళ్ళజోడు అవసరమైన వాడికి తక్కువ ధరకే అందించారు. ఈ కార్యక్రమంలో సుమన్ ఐ కేర్ వైద్యులు డాక్టర్ అశోక్, రాజేష్, వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి, వార్డు మెంబర్లు మేకల కుమార్, రావుల రాజశేఖర్, అంజయ్య, సర్దార్, మహమ్మద్ యాకుబ్ అలీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వడదెబ్బ కు వానరం మృతి.. ఘనంగా అంత్యక్రియలు

**నేలకొండపల్లి, మే 31 మహా:** ఎండ తీవ్రత కు వానరం మృతి చెందటంతో...గ్రామస్తులు అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. మండలం లోని మంగాపురంతండా లో ఆదివారం ఓ వానరం ఎండ తీవ్రత కు గ్రామస్తులు చూస్తుండుగానే...ప్రధాన సెంటర్ లో కుప్పకూలింది. గత కొంత కాలం నుంచి గ్రామంలో రామాలయం దగ్గర నిత్యం సంచరిస్తుంది. రామాలయం వద్ద ఎండ దెబ్బకు మృతి చెందటంతో గ్రామస్తులు వానరంకు కుంకమ్మ చల్లి...డప్పు వాయిద్యాలతో...అంత్యక్రియలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు దీర్ఘావత్ రాధా కృష్ణమూర్తి, కోటేశ్వరరావు, నాగరాజు, తేజావత్ శంకర్, బీ.వెంకటేశ్వర్లు, తేజావత్ మల్లిఖార్జున్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

- మద్దతు ధర పేరుతో కేంద్రం దగా

కారేపల్లి, మహా : కేంద్ర ప్రభుత్వం రైతాంగం పండించిన పంటలకు ఎం.ఎస్.పి పేరుతో నామమాత్రపు ధరను నిర్ణయించడాన్ని నిరసిస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి, మాస్ లైన్ ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ, మద్దతు ధర జీవో పత్రాలను దహనం చేశారు. పేరుపల్లి హోలియా తండా వద్ద వేరువేరుగా జరిగిన కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ, మాస్ లైన్ నాయకులు పాల్గొని మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయకుండా నామమాత్రకు మద్దతు ధర పెంచి రైతులను మోసం చేస్తుందని విమర్శించారు కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక చర్యలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్, నాయకులు కోయల శ్రీను, కంచర్ల శ్రీనివాసరెడ్డి, వై జానకి, కావేటి నాగేశ్వరరావు, ఆలెం చంద్రయ్య, మాస్ లైన్ నాయకులు గుగులోత్ తేజ నాయక్, ధారావత్ సక్రు, పులకాని సత్తిరెడ్డి, రావుల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపంథా నాయకుడు మృతి

**నివాళులర్పించిన టేకులగూడెం సర్పంచ్**

కారేపల్లి, మహా : కారేపల్లి మండలం టేకులగూడెం చెందిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు మోకాళ్ళ రామకృష్ణ (42) ఆదివారం మృతి చెందారు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించి మృతి చెందారు రామకృష్ణ మృదేహాన్ని టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్ సందర్శించి నివాళులర్పించారు కుటుంబానికి సానుభూతి తెలిపారు. రామకృష్ణ కు నివాళులర్పించిన వారిలో టేకులగూడెం ఉప సర్పంచ్ బిక్కసాని భాస్కర్ రావు, గుమ్మడి ఎర్రయ్య, కోడెం సీతారాములు, పాయం కృష్ణ, గుమ్మడి రవి, గొగ్గెల కృష్ణ, శ్రీను రామయ్య తదితరులు ఉన్నారు.





## ప్రజావాణికి అధికారులు

# సకాలంలో హాజరు కావాలి

* జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి బ్యూరో, మహా**: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి..

- ఎర్ర బ్యాడ్జీలతో మణుగూరు డిపో కార్మికుల నిరసన..
- జూన్ 2న విలీన ప్రకటన చేయాలని జేఏసీ డిమాండ్..

**మణుగూరు, మహా** : తెలంగాణ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మణుగూరు ఆర్టీసీ డిపోలో ఆదివారం కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టీసీని పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేయాలనే ప్రధాన డిమాండ్‌తో కార్మికులు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆర్టీసీ కార్మికులు ప్రజలకు నిరంతరాయంగా సేవలు అందిస్తున్నప్పటికీ, కార్మికుల న్యాయమైన డిమాండ్లు ఇంకా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కోరారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు శుభవార్త అందించి, విలీనంపై అధికారిక ప్రకటన చేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కావడం ద్వారా సంస్థ మరింత బలోపేతం కావడంతో పాటు కార్మికులకు ఉద్యోగ భద్రత, సంక్షేమ ప్రయోజనాలు మెరుగుపడతాయని నాయకులు పేర్కొన్నారు. కార్మికుల ఆకాంక్షలను గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని మణుగూరు డిపో జేఏసీ కమిటీ విజ్ఞప్తి చేసింది. నిరసన కార్యక్రమంలో జేఏసీ నాయకులు పవన్ కుమార్, మురళి, అశోక్, శ్రావణి, సందీప్, వెంకటేశ్వర్లు, పూర్ణ, రాంబాబు, డిపోకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు

# ఎంబిబియస్ లో ప్రథమస్థానం సాధించిన కేదాసి జాహ్నవి

- పలువురి ప్రశంసలు
- ఎంబిబియస్ లో ప్రథమస్థానం సాధించిన కేదాసి జాహ్నవి.



' వైద్యో నారాయణ హరి ' అంటారు మన పెద్దలు. వైద్యులు భగవంతుని తో సమానం అనే కదాఅర్థం. ఏ డిగ్రీ చదివినా ,ఏ ఉద్యోగం సంపాదించినా నిరుపేదలకు సేవ చేయగలిగే అవకాశం కేవలం వైద్య వృత్తిలోనే ఉంటుంది. చిన్నప్పటి నుండి నిరుపేదలకు సేవ చేయాలనే తన తల్లిదండ్రుల సామాజిక లక్షణాలను తనతో పాటే అలవర్చుకొని పట్టుదలతో వైద్యవృత్తిలో రాణించింది ఆమె.

పట్టుదల ఉంటే ఏదైనా సాదించడం కష్టమేమి కాదంటూ మరొకరికి స్ఫూర్తిగా బాటలు వేసింది. ఏకంగా ఎంబిబియస్ లోనే ప్రథమస్థానం సాదించి తన తల్లిదండ్రులకు ,తన స్వగ్రామానికి ,గురువులకు ప్రతిఒక్కరికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టింది.

మండల కేంద్రమైన దమ్మపేటకు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకులు ,మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కేవీ సత్యనారాయణ రాధ దంపతుల ద్వితీయ కుమార్తె కేదాసి కావ్య జాహ్నవి ఎంబీబీఎస్ లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. హైదరాబాద్ లోని మల్లారెడ్డి మహిళా కళాశాలలో ఎంబిబియస్ లో ప్రథమస్థానంలో ఉత్తీర్ణత సాధించింది. కావ్య 1 వతరగతి నుండి 5వ తరగతి వరకు దమ్మపేట లోని సెయింట్ మేరీస్ స్కూల్లో , 6 నుండి 10 వరకు గంగారంలోని డిఏవి స్కూల్లో , ఇంటర్ విజయవాడలోని చైతన్య కాలేజీలో చదివి అత్యుత్తమ ప్రతిభను కనబరిచింది. అనంతరం 2021 కరోనా టైంలో ఎటువంటి శిక్షణ లేకుండా నీట్ పరీక్ష రాసి పరీక్షలో 2100 ర్యాంకును సంపాదించి తల్లిదండ్రులతోపాటు అందరిని ఆశ్చర్య చకితులను చేసింది. ఈ క్రమంలో హైదరాబాదులోని మల్లారెడ్డి ఉమెన్స్ కళాశాలలో ఎంబీబీఎస్ ఉచిత సీటు కావ్యను వరించింది.ఎంబీబీఎస్ లో ఉచిత సీటుని సాధించడమే కాకుండా నాలుగు సంవత్సరాలు ఎంబీబీఎస్ లో ప్రతి ఏటా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి మెరుగైన విద్యా ప్రతిభను కనపరిచింది. కష్టతరమైన నీట్ తో పాటుగా ఎంబీబీఎస్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కావ్య జాహ్నవి తన తల్లిదండ్రులకు ఎనలేని పేరు ప్రఖ్యాతలు తీసుకురాగా మండలంలోని కేవీ సన్నిహితులు, మిత్రులు, పార్టీలకతీతంగా పలువురు నాయకులు కావ్య జాహ్నవి ను ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.


ఈ సందర్భంగా కావ్య జాహ్నవి మాట్లాడుతూ తన తల్లిదండ్రులు, తనకు విద్యను నేర్పించిన గురువులు ఇచ్చిన స్ఫూర్తి ని, విద్యా బుద్ధులను అన్ని విధాల సద్వినియోగం చేసుకుని మెరుగైన ప్రతిభతో ప్రథమస్థానం దక్కించుకున్నానని , రానున్న రోజుల్లో కూడా డాక్టర్ వృత్తి ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.కావ్యను అభినందించిన వారిలో మాజీ వైస్ ఎంపిపి దారా మల్లిఖార్జున రావు ,మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వర రావు , పశువైద్యులు మన్యం రమేష్ బాబు , మైనారిటీ నాయకులు షేక్ సైదా , పట్టణ కాంగ్రెస్ నాయకులు ,జర్నలిస్టులు తదితరులు ఉన్నారు.



# నూతన పెట్రోల్ బంకును ప్రారంభించిన ఉప సర్పంచ్ కన్నెదారి రమేష్

**బూర్గంపహాడ్, మహా** : సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో సారపాక నుండి నాగినేనిప్రోలు రెడ్డిపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో మూలమలుపు దాటిన అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీనివాస పెట్రోల్ బంకును సారపాక మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కన్నెదారి రమేష్ రిబ్బన్ కటింగ్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బుల్లెట్ బండి తో పరారైన ఘనుడు.




రాజేంద్రనగర్ మహా ; శంషాబాద్ సర్కిల్ పరిధి మధురనగర్ లోని రాయల్ ఎన్ఫీల్డ్ మోటర్ షో రూమ్ లోకి శనివారం వినియోగదారుడిలా ఓ యువకుడు వచ్చి షోరూంలో పనిచేస్తున్న సిబ్బందిని ఏ మార్చి రాయల్ ఎన్ఫీల్డ్ ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్నట్టు నటిస్తూ ఓ రాయల్ ఎన్ఫీల్డ్ బుల్లెట్ బండి తీసుకొని ఉడయించాడు. షో రూమ్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయగా షో రూమ్ లో సిసి పొటేజ్ను పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 3 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

**నేలకొండపల్లి, మే 31 మహా**:కానిస్టేబుల్ బాణోత్ ప్రసాద్ జ్ఞాపకార్థం ఈ నెల 3 నుంచి జిల్లా స్థాయి. క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆజ్వండా యూత్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు.... కానిస్టేబుల్ ప్రసాద్ ను స్మరించకుంటూ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో యువత లో దాగి ఉన్న క్రీడా స్పూర్తిని వెలికితీసేందుకు తండా యూత్ కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 3 నుంచి జిల్లా స్థాయి లో క్రికెట్ టోర్నమెంట్ కి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కావునా ఆసక్తి గల క్రీడాకారులు పోటీలలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. విజేతలకు షీల్డ్, నగదు బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో ఆజయ తండా యూత్ సభ్యులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లిలో మావోయిస్టు అగ్ర నేత కట్కం సుదర్శన్ వర్ధంతి

**పోలీసు నిఘా నడుమ నిర్వహణ.**

**బెల్లంపల్లి, మహా**: మావోయిస్టు అగ్ర నేతగా పేరుగాంచిన బెల్లంపల్లికి చెందిన కటకం సుదర్శన్ మూడో వర్ధంతి వేడుకలు ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం రోజు బెల్లంపల్లి పట్టణం కన్నాలబస్తీ నివాసంలో నిర్వహించగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. దశాబ్దాల కాలం పాటు మావోయిస్టు ఉద్యమానికి కీలక వ్యక్తిగా పేరుగాంచి మావోయిస్టు బ్యూరో సభ్యుడుగా విధులు నిర్వహించి సుదర్శన్ అలియాస్ దూలా దాదా గా మావోయిస్టు ఉద్యమంలో పేరుగాంచాడు. వర్ధంతి వేడుకలను ఆయన సోదరుడు కణాల బస్తి వార్డు కౌన్సిలర్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతగా కటకం సతీష్ జమున దంపతులతో పాటు ఆయన కుటుంబ సభ్యులు సుదర్శన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు మావోయిస్టు అనుబంధ సంఘాలు అజ్ఞాతవాడిన మావోయిస్టు అగ్ర నేతలు వస్తారని సమాచారంతో పోలీసులు వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్న ఇంటి చుట్టూ పోలీసులు గస్తీ నిర్వహించారు.వర్ధంతి వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరు కావాల్సి ఉండగా పోలీసుల అభ్యంతరం మేరకే వర్ధంతి వేడుకలకు హాజరు కాలేదని సమాచారం

# రాజ్యాధికార సాధన దిశగా మున్నూరు కాపులు ముందుకు సాగాలి

**రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమ రావు**



మహా వరంగల్ బ్యూరో; మున్నూరు కాపులు ఐక్యంగా, సంఘటితంగా ముందుకు సాగుతూ ఇతర బహుజన వర్గాలను కూడా కలుపుకొని రాజ్యాధికార సాధన దిశగా కృషి చేయాలని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు పటేల్ అధ్యక్షతన, గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పటేల్ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని ఆకుతోట కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన సమావేశంలో పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో మున్నూరు కాపుల జనాభాను వాస్తవానికి తక్కువగా నమోదు చేసినట్లు సమావేశం అభిప్రాయపడింది. రాష్ట్రవ్యాప్తంగా సంఘం ఆధ్వర్యంలో పారదర్శకంగా మున్నూరు కాపుల జనగణన నిర్వహించి, తమ జనాభా నిష్పత్తికి అనుగుణంగా హక్కులు, అవకాశాలు, వాటా సాధించేందుకు కృషి చేయాలని తీర్మానించింది. మున్నూరు కాపు సమాజానికి చెందిన వి. హన్మంతరావును ప్రభుత్వ సలహాదారుగా, గద్వాల విజయలక్ష్మిని మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని సమావేశం అభినందించింది. అదే సమయంలో రాష్ట్ర మంత్రివర్గంలో మున్నూరు కాపులకు తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవడం పై విచారం వ్యక్తం చేస్తూ, వెంటనే మంత్రివర్గంలో మున్నూరు కాపులకు స్థానం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరింది. ఇటీవలి కాలంలో మున్నూరు కాపు అధికారుల పై, ప్రజా ప్రతినిధుల పై, రాజకీయ నాయకుల పై దాడులు పెరుగుతున్నాయని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి ఘటనలను మున్నూరు కాపు సమాజం సంఘటితంగా ఎదుర్కొని తిప్పికొట్టాలని పిలుపునిచ్చింది. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణం కోసం కొండా సురేఖ మురళీధర్ పటేల్ తమ నిధుల నుంచి రూ.3 కోట్లను మంజూరు చేయడం పట్ల సమావేశం హర్షం వ్యక్తం చేస్తూ వారికి ఏకగ్రీవంగా ధన్యవాదాలు తెలిపింది. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ పట్టణ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో జూన్ నెలలో నిర్వహించనున్న ఏరువాక పున్నమి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి వందలాది మంది మున్నూరు కాపు నాయకులు, కార్యకర్తలు సుమారు 100 కార్లతో రాయచూర్ కు తరలి వెళ్లాలని పిలుపునిచ్చింది. ఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆదిలాబాద్ నుండి అలంపూర్ వరకు, కొత్తగూడెం నుండి సంగారెడ్డి వరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు చల్లా హరిశంకర్ పటేల్, బుక్క వేణుగోపాల్ పటేల్, మంగళారపు లక్ష్మణ్ పటేల్, ఉప్పు రవీందర్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు నీలం రాజకిశోర్ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొరబోయిన సాంబయ్య పటేల్, బొజ్జం రమేష్ పటేల్, కడారు రమేష్‌బాబు పటేల్, రాష్ట్ర కార్యదర్శులు కందుల సృజన్ పటేల్, చందా గోపి పటేల్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి జంగిలి శ్రీనివాస్ పటేల్, మెట్టు నర్సింగ్‌రావు పటేల్, జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల రవి పటేల్, పొతు కుమార స్వామి పటేల్, పెండల సంపత్ పటేల్, పిట్టల మధు పటేల్, పోగుల సారంగపాణి పటేల్, నీలం శ్రీనివాస్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సీయం పర్యటన

- ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు
- రెండో విడతకు శ్రీకారం
- బహిరంగ సభలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి



**ఆదిలాబాద్ మహా** : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. కొత్తగూడలో తొలి విడత కింద నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించే బహిరంగ సభలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి.ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణ ప్రక్రియ ప్రారంభమైంది. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఆసిఫాబాద్ జిల్లా నుంచే ప్రారంభించనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.సీఎం పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే సభకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఏర్పాట్ల పర్యవేక్షణలో నిమగ్నమయ్యారు.



## ఆలయ అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిది

**ఆలయ అధ్యక్షులు తోట బాబన్న**

మహా వరంగల్ బ్యూరో; వరంగల్ తూర్పు నియోజకవర్గం 34 డివిజన్ శివనగర్ లోని మెట్లబావిశ్రీ ధన మైసమ్మ ఆలయాన్ని నిర్మించి మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా తృతీయ వార్షికోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు .ఈ కార్యక్రమాలను ఈనెల 20 నుంచి 21 వరకు నిర్వహించడం జరుగుతుంది. ఈ వేడుకలకు కావలసిన మైక్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ లైటింగ్, ఎంట్రన్స్ లైటింగ్ ఆర్చిలర్ కు గాను 50 116 రూపాయలతో శ్రీదేవి మైక్, సౌండ్ సిస్టమ్ యజమాని తిరుమల రమేష్ కళావతి దాతలుగా ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు తోట బాబన్న మాట్లాడుతూ శ్రీ ధన మైసమ్మ అమ్మవారు తిరుమల రమేష్ కళావతి అమ్మవారినీ కోరిన కోరికలు తీర్చినందుకుగాను తృతీయ వార్షికోత్సవ కర పత్రికను చూసి వెంటనే తృతీయ వార్షికోత్సవ కార్యక్రమానికి మైక్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ లైటింగ్స్, ఎంట్రన్స్ లైటింగ్ ఆర్చ్ లు ఏర్పాటు చేయుటకు ముందుకు వచ్చినందుకు ఆలయ అధ్యక్షులు తోట బాబన్న ఈ దంపతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు వారి పై వారి కుటుంబం పై ఉండాలని ఆలయ అధ్యక్షులు అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వెంకన్న నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యల పరిష్కారానికై..

- ఎమ్మెల్యే పాయంను ఆశ్రయించిన ప్రజాప్రతినిధులు..
- పలు గ్రామాల నుంచి వినతిపత్రాల వెల్లువ
- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాయం హామీ..



**మణుగూరు, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు ఆదివారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు అందజేశారు. మౌలిక వసతులు, రహదారులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, డ్రైనేజీ, పోడు భూముల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కరకగూడెం మండలం కలవలనాగారం గ్రామానికి చెందిన సర్పంచ్ కల్తీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి, సుమారు 140 పోడు రైతు కుటుంబాలకు భూ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కోర్టు కేసుల కారణంగా నిలిచిపోయిన పోడు పట్టాల ప్రక్రియను పునఃప్రారంభించి అర్హులకు పట్టాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, గ్రామ అంతర్గత రహదారుల అభివృద్ధి, అంగోరు గూడెం గ్రామానికి విద్యుత్, రహదారి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. కూనవరం పంచాయతీకి చెందిన గ్రామ ప్రతినిధులు గ్రామంలో నెలకొన్న మౌలిక వసతుల కొరత, రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్య, విద్యుత్ మరియు డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని కోరారు. పినపాక మండలం పాతరెడ్డిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని చింతల బయ్యారం గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు కూడా ఎమ్మెల్యేను కలిసి గ్రామాభివృద్ధికి అవసరమైన రహదారులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ మరియు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మర్కోడు గ్రామ పంచాయతీ సర్పంచ్ సుతారి రమాదేవి, ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్ ఆధ్వర్యంలో గ్రామ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతి పత్రాలు అందజేసిన వారిలో ఆయా గ్రామాల భారీగా.. కూనవరం పంచాయతీ నుంచి ఎనిక బాల కృష్ణ, మడకం పెంటయ్య, ఎనిక సీతయ్య, కటిబోయిన అభిరామ్, గొర్రె ప్రశాంత్, వంక ముకేందర్, వార్డు సభ్యులు ఎనిక భద్రం, మడకం శేషగిరిరావు తదితరులు పాల్గొనగా, కలవలనాగారం గ్రామం నుంచి సర్పంచ్ కల్తీ విజయ్ కుమార్, కలం సాంబమూర్తి, ఇర్ప బుచ్చయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, నర్సమ్మ, తుడుందెబ్బ ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకట్ నారాయణ తదితరులు హాజరయ్యారు. అదేవిధంగా చింతల బయ్యారం గ్రామం నుంచి మాజీ ఎంపీటీసీ పొనగంటి శివకృష్ణ, పొనగంటి శ్రీను, పొనగంటి సాంబశివరావు, డి.రామకృష్ణ, పి.రాంబాబు, పొనగంటి వెంకటేశ్వర్లు, టి.సత్యం, మాటూరి సతీష్, టి.బాలకృష్ణ, బట్ట గణేష్, కె.లక్ష్మీనారాయణ, పొనగంటి సమ్మయ్య, టి.చంటి, పొనగంటి నాగబాబు, తోట పవన్ తదితరులు పాల్గొనగా, మర్కోడు గ్రామపంచాయతీ నుంచి మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుతారి కృష్ణ, మహిళా నాయకురాలు షేక్ పర్వీన్, దొడ్డి రాము, ముప్పారపు రాము, జనగం సాయి, వేమూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వి.ఓ.ఏ.లకు అన్నదానం


**దమ్మపేట ,మే31 మహా** : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని గత కొన్నిరోజులుగా మండల కేంద్రంలో గ్రామ దీపికలు నిరవధిక సమ్మె కు దిగారు. ఈ క్రమంలో మండుటెండలో చేస్తున్న సమ్మె కు తమ మద్దతుగా స్థానికంగా ఉన్న గాయత్రీ ప్రైవేట్ వైద్యశాల డాక్టర్ల బృందం ,యాజమాన్యం ,సిబ్బంది గ్రామదీపికల కు అన్న వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామ దీపికలు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను ఉపసంహరించబోమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పసుమర్తి మౌనిక (గైనకాలజిస్ట్), డాక్టర్ సాయికృష్ణ (యంబిబియస్ .జనరల్) , యాజమాన్యం అజీమ్ పాష , విజయ్ , రఫి ,మధు ,సిబ్బంది పాల్గొన్నారు.



## ఓటర్ల సవరణ పై అవగాహన కలిగించాలి

- బీజేపీ మండలఅధ్యక్షుడు పాగర్తి సుధాకర్

**నేలకొండపల్లి, మే 31 మహా**: దేశాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని బీజేపీ మండలఅధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మన్ కి బాత్ కార్యక్రమం ను ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... ప్రభుత్వ పథకాల పై ప్రజలలో చైతన్యం కల్పించాలని సూచించారు. ఓటర్ల సవరణ, ఎస్.ఐ.ఆర్. కార్యక్రమం పై అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాల గురించి ఇంటింటా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. మన్ కి బాత్ కార్యక్రమంలోని ప్రధాన అంశాల ను క్షేత్ర స్థాయిలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పథకాలకు కేంద్రం అందించే నిధుల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు సరిపడా సొసైటీల లో సిద్ధంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, ఉపాధ్యాక్షుడు పురాణం దివాకర్, కొండా హర్షవర్ధన్, కందరబోయిన గోపి, ఎలిగేటి వెంకటేష్, తొగాటి నాగచారీ, పిట్టల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



## మాల సంక్షేమ సంఘ కార్యాలయాన్ని సందర్శించిన ఎంపీ

**ఆదిలాబాద్ మహా** : మాల సంక్షేమ సంఘానికి తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఆదిలాబాద్ బీఎల్ఏ2 సమావేశానికి వచ్చిన ఆయన స్థానికంగా ఉన్న మాల సంక్షేమ సంఘ కార్యాలయాన్నిపార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. సంఘ నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. మాలల హక్కుల సాధన కోసం తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు.సంఘ అభివృద్ధికి కార్యవర్గం కలిసి పనిచేయాలని సూచించారు. అనంతరం పట్టణంలోని మాజీ మంత్రి సీఆర్ఆర్ నివాసాన్నిఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తో కలిసి సందర్శించి సీఆర్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆదిలాబాద్ ప్రజల కోసం పార్టీ కోసం సీఆర్ఆర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ,బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష , గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఆదిలాబాద్ ,జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్లు బోరంచు శ్రీకాంత్ రెడ్డి, అల్లూరి అశోక్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, గండ్రత్ సుజాత, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజీద్ ఖాన్, సంజీవ రెడ్డి , అడ్డి భోజారెడ్డి, గోక గణేష్ రెడ్డి ,లోక ప్రవీణ్ రెడ్డి, కొండ గంగాధర్ ,శాంతన్ రావు, మాల సంక్షేమ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే

**ఆదిలాబాద్ మహా** : కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ2 సమావేశానికి ఆదివారం ఆదిలాబాద్ పట్టణానికి విచ్చేసిన ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు . కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కంది శ్రీనివాస రెడ్డి ఘన స్వాగతం పలికారు..వారిని శాలువాలతో సత్కరించారు. అనంతరం తన కార్యాలయం అంతా తిప్పి చూపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్, ఆదిలాబాద్ ,జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్లు బోరంచు శ్రీకాంత్ రెడ్డి, అల్లూరి అశోక్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మసంతోష్‌రావు, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజీద్ ఖాన్, అడ్డి భోజారెడ్డి, గోక గణేష్ రెడ్డి ,లోక ప్రవీణ్ రెడ్డి, కొండ గంగాధర్ ,శాంతన్ రావు తదితరులు పాల్గొన్నారు.





## క్రికెట్ విజేతలకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బహుమతులు

- **నిర్వాహకులు బొద్దం మహేష్ యాదవ్ కు అభినందనలు**

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండల్ పెద్దతూప్రా గ్రామంలో బొద్ధం మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా క్రికెట్ టోర్న మెంట్‌ను నిర్వహించారు. ఆదివారం ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే టీ ప్రకాష్ గౌడ్ ఫైనల్ మ్యాచ్ ను వీక్షించి అనంతరంవిజేతలుగా నిలిచిన జట్లకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ యువకులను ఉత్సాహపరిచే క్రీడా పోటీలను ప్రోత్సహిస్తున్నటువంటి బొద్ధం మహేష్ యాదవ్ ని అభినందించారు. ముందు ముందు జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించేందుకు తన వంతు సహకారం ఉంటుందిఅన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గణేష్ గుప్తా,నిరటి రాజు, పెద్ద తూప్రా గ్రామస్తులు ఆటగాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో కోహెడ మార్కెట్ నిర్మాణం

- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**ఇబ్రహీంపట్నం, మే 31 మహా:** కోహెడలో నిర్మిస్తున్న అంతర్జాతీయ సమీకృత మార్కెట్ దేశానికే తలమానికంగా నిలుస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మెరుగైన ప్రమాణాలతో కూడిన మార్కెట్ గా ఉండబోతుందని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. అదివారం కోహెడ మార్కెట్ శంకుస్థాపన నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ ముఖ్య కార్యదర్శి కె సురేంద్ర మోహన్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మిబాయి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఇతర ఉన్నత అధికారులు..పాలకవర్గం సభ్యులు కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... కోహెడలో నిర్మించే మార్కెట్ దేశానికే దిక్సూచిగా మారుతుందని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కోహెడ పండ్ల మార్కెట్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులకు వ్యాపారులకు వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా అన్ని సౌకర్యాలతో కూడిన ఏర్పాట్లు మార్కెట్ లో ఉంటాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొనే శంకుస్థాపన కార్యక్రమంలో వేలాది మంది రైతులు మహిళలు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మి బాయి, హాకా డైరెక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి , గిడ్డంగుల సంస్థ ఎండి శ్రీమతి కొర్ర లక్ష్మి, ఆగ్రోస్ ఎండి రాములు, అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు, రవికుమార్ తో పాటు గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర చారి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు పన్యాల జైపాల్ రెడ్డి, బండి మధుసూదన్ రావు, అంజయ్య, మేకం లక్ష్మి, రఘుపతి రెడ్డి, నవరాజ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.





## రంగారెడ్డి జిల్లా నూతన డీఈఓగా వెంకటేశ్వర్లు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** విద్యా శాఖ అధికారుల బదిలీల్లో భాగంగా రంగా రెడ్డి జిల్లా నూతన జిల్లా విద్యాశాఖాధికారిగా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన విద్యాశాఖ అధికారుల బదిలీల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా నూతన జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) గా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా డీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లు రంగారెడ్డి జిల్లా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు రంగారెడ్డి జిల్లా డీఈఓగా సేవలందించిన సుశీందర్ రావు బదిలీపై మరో జిల్లాకు బదిలీ అయ్యారు.



## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- **మంత్రి కొండా సురేఖ**

**మహా వరంగల్ బ్యూరో ;** వరంగల్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నేత చిప్ప వెంకటేశ్వర్లు నేత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కట్టు శిక్షణా కేంద్రాన్ని ఆదివారం మంత్రి కొండా సురేఖ సందర్శించారు. మహిళలు గత 2 నెలలుగా కట్టు శిక్షణ పొందిన మహిళలు స్వయంగా వారి డ్రెస్సులు కుట్టుకుని ధరించి మంత్రికి చూపియ్యడంతో వారి ప్రతిభను చూసి మంత్రి ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయించిన చిప్ప వెంకటేశ్వర్లు ను ప్రత్యేకంగా అభినందిస్తూ దీనికోసం కృషి చేస్తున్న మాస్టర్ శ్రీకరుణ ఇంచార్జులు గజ్జెల కావ్య, ఆడెపు శిరీష, చిప్ప కావ్యాల ను ఈ సందర్భంగా మంత్రి అభినందించడం జరిగింది. త్వరలో కాకతీయ మేఘా టెక్స్టైల్ పార్కు సందర్శన,

# స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ' ఏర్పాటుతో ఆధ్యాత్మిక కేంద్రంగా రంగారెడ్డిజిల్లా

- **దేవనాథ రామానుజ జీయర్ స్వామి..**

**ఇబ్రహీంపట్నం, మే 31 మహా:** రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ పరిధిలో అత్యాధునిక వసతులతో నూతనంగా నిర్మించిన 'సుధర్మ విల్లాస్' లాంచింగ్ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామిజీ చేతుల మీదుగా విల్లాస్ బ్రోచర్‌ను ఆవిష్కరించి, వెంచర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజ్యశ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామిజీ మాట్లాడుతూ... హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలకే కాకుండా, దేశ విదేశాల నుండి వచ్చే వారు కూడా, రంగారెడ్డి జిల్లా పరిసర ప్రాంతాలలో స్థిరపడటానికి ప్రస్తుతం చాలామంది ఆసక్తి చూపుతున్నారని ఆయన అన్నారు. అందుకు తగ్గట్టుగానే భాగ్యనగర పరిసరాల్లో అత్యుత్తమ, సౌకర్యవంతమైన వసతులు అందుబాటులోకి వస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో సామాజిక సమతా భావనకు ప్రతీక అయినటువంటి శ్రీ చిన్నజీయర్ స్వామివారి 'స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ' ఏర్పాటైనప్పటి నుండి, ఈ ప్రాంతమంతా ఒక గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా విరజిల్లుతోందని స్వామీజీ కొనియాడారు. ఈ నేపథ్యంలో, హైదరాబాద్ శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటోందని, ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ ప్రాంతంలో "సుధర్మ గ్రూప్" ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న లగ్జరీ ట్రిప్లెక్స్ విల్లా ప్రాజెక్ట్‌ను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఇక్కడ అన్ని రకాల అత్యాధునిక వసతులతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో 'సుధర్మ విల్లాస్'ను నిర్మించడం అభినందనీయమన్నారు. ప్రకృతి ఒడిలో, ప్రశాంత వాతావరణంలో వెలిసిన ఈ విల్లాస్ సదుపాయాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, నిత్య జీవితంలో ధర్మ మార్గంలో నడవాలని ఈ సందర్భంగా స్వామీజీ పిలుపునిచ్చారు.



## ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటుంది

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

బెల్లంపల్లి,మహా: మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నాడు కురిసిన ఈదురు గాలులు, వర్షాల కారణంగా ఇంటి పైభాగంలో ఉన్న రేకులు గాలికి ఎగిరిపడి కింద పడిన ఘటన చోటుచేసుకోగా క్షేత్రస్థాయిలో స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ తో పాటు బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావస్వాతి రమేష్ బాబు పరిశీలించి బాధితులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఎమ్మెల్యే తెలిపారు.సంబంధిత అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అండగా ఎల్లప్పుడూ ఉంటామని హామీ ఇచ్చారు. ...



## కాటేదాన్ లో మన్ కీ బాత్ సందడి

రాజేంద్రనగర్ , మహా ; కాటేదాన్ డివిజన్ పరిధిలో డివిజన్ అధ్యక్షులు గోద పాండు యాదవ్ ఆధ్వర్యంలో సాయిబాబా నగర్ లో సీనియర్ నాయకులు సంతోష్‌గౌడ్ నివాసంలో ఆదివారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ 134 వ మన్ కి బాత్ కార్యక్రమాన్ని నియోజక వర్గ ఇంచార్జ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి బిజెపి నాయకులతో కలిసి మన్ కి బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నర్సింహ, రమేష్ రెడ్డి, ఎన్ను శంకర్ రెడ్డి, రామ రావు, శేఖర్, కిరణ్, రాజలింగం, రమేష్ యాదవ్, విజయ్, చింటూ,తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ 2026 ఛాంపియన్ ఆర్సీబీ వరుసగా రెండోసారి బెంగళూరు విక్టరీ

## అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించిన విరాట్ కోహ్లీ

**అహ్మదాబాద్, మహా : ఐపీఎల్ 2026 ఛాంపియన్ గా మరోసారి బెంగళూరు జట్టు విజయం సాధించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి సూపర్ విక్టరీ సాధించింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) నిలిచింది. నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (75 నాటౌట్; 42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుతమైన అర్ధశతకంతో జట్టును ముందుండి నడిపించి విజయతీరాలకు చేర్చాడు. 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు విరాట్ కోహ్లీ, వెంకటేశ్ అయ్యర్ (32; 16 బంతుల్లో) అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. ఆర్సీబీ విజయంతో అభిమానులు సంబరాలు చేసుకున్నారు.**







## జాతి నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకం

- **సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ**

వరంగల్, మహా : నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సర్వసభ్య సమావేశం వరంగల్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ వైద్య కళాశాలలు, దంత వైద్య కళాశాలలు మరియు ఆసుపత్రుల నుండి 100 మందికి పైగా వైద్యులు, వైద్య విద్యార్థులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో గత ఏడాది కాలంలో సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాలు, సంస్థాగత కార్యకలాపాలు, సాధించిన విజయాలపై సమగ్ర నివేదిక ప్రకటించారు. అదేవిధంగా 2026-27 సంవత్సరానికి సంబంధించిన నూతన రాష్ట్ర కార్యవర్గ ఎంపిక, రాబోయే సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్, వి.వి. లక్ష్మీనారాయణ అప్పల ప్రసాద్ వైద్యుల సామాజిక బాధ్యత, గ్రామీణ ప్రాంతాల్లో సేవల అవసరం, జాతి నిర్మాణంలో వైద్యుల పాత్ర తదితర అంశాలపై ప్రేరణాత్మక ప్రసంగాలు చేశారు. ఎన్.ఎం.ఓ జాతీయ ప్రధాన కార్యదర్శి డా. కుమార్ అంగాడి జీ మార్గదర్శకత్వంలో సమావేశం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బందెల మోహన్ రావు, డాక్టర్ విజయ చందర్ రెడ్డి పాల్గొన్నారు.

08 మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | సోమవారం, హైదరాబాద్ | 01-06-2026
ANN తెలుగు

# రెడ్ లెహంగా లుక్‌తో ఆకట్టుకుంటున్న రాశా థడానీ

## రవీనా టాండన్ కుమార్తెగా సినీ రంగంలో ప్రత్యేక గుర్తింపు


**ముంబై:** బాలీవుడ్‌లో కొత్త తరం హీరోయిన్లలో వేగంగా గుర్తింపు తెచ్చుకుంటున్న వారిలో రాశా థడానీ పేరు ఇప్పుడు ప్రముఖంగా వినిపిస్తోంది. సంప్రదాయ దుస్తుల్లోనూ మోడ్రన్ స్టైల్‌ను ప్రతిబింబిస్తూ సోషల్ మీడియాలో తరచూ ఆకట్టుకుంటున్న ఈ యువ నటి.. తాజాగా రెడ్ ప్రింటెడ్ లెహంగా చోళీలో కనిపించి మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించింది. పొడవాటి వేవీ హెయిర్, సంప్రదాయ ఆభరణాలు, కాన్ఫిడెంట్ లుక్‌తో రాశా స్టైలిష్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

2005 మార్చి 16న ముంబైలో జన్మించిన రాశా.. ప్రముఖ నటి రవీనా టాండన్, ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్ అనిల్ థడానీ కుమార్తె. చిన్నప్పటి నుంచే గ్లామర్ ప్రపంచానికి దగ్గరగా పెరిగిన రాశా.. సినిమాల్లోకి రావడం అభిమానులకు పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అయితే స్టార్ కిడ్ అనే ట్యాగ్‌కే పరిమితం కాకుండా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తోంది.2025లో అభిషేక్ కపూర్ దర్శకత్వంలో తెరకెక్కిన పీరియడ్ యాక్షన్ డ్రామా 'ఆజాద్' చిత్రంతో రాశా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆమన్ దేవగన్ సరసన 'జానకి' పాత్రలో నటించిన రాశా.. తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రశంసలు అందుకుంది. సినిమా బాక్సాఫీస్ వద్ద మిశ్రమ ఫలితాలు సాధించినప్పటికీ, రాశా నటనకు మాత్రం మంచి స్పందన లభించింది.కేవలం 21 ఏళ్ల వయసులోనే వరుస అవకాశాలు అందుకుంటున్న రాశా ప్రస్తుతం పలు ఆసక్తికర ప్రాజెక్టులతో బిజీగా ఉంది. వచ్చే ఏడాది విడుదల కానున్న రొమాంటిక్ చిత్రం 'లైకీ లైకా'లో అభయ్ వర్మ సరసన నటిస్తోంది. ఇదే సమయంలో టాలీవుడ్‌లో కూడా అడుగుపెడుతోంది. మహేష్ బాబు మేనల్లుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా రూపొందుతున్న 'శ్రీనివాస మంగాపురం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం కానుంది. అలాగే వీర్ హిరానీతో కలిసి 'లగన్ లాగీ రే' చిత్రానికి కూడా సైన్ చేసింది.బలమైన సినీ నేపథ్యం, గ్లామర్, సరైన ప్రాజెక్ట్ ఎంపికలతో రాశా థడానీ.. నెమ్మదిగా తనదైన మార్గాన్ని నిర్మించుకుంటూ భారతీయ సినీ పరిశ్రమలో మరో స్టార్ హీరోయిన్‌గా ఎదిగే దిశగా అడుగులు వేస్తోంది.





# దంగల్ సీక్వెల్ కోసం ఎదురుచూపులు




**ముంబై:** బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ నటించిన 'దంగల్' చిత్రం భారతీయ సినీ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సంగతి తెలిసిందే. నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.2000 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా చైనాలో ఈ చిత్రం సాధించిన అద్భుత విజయమే అంతర్జాతీయ స్థాయిలో దంగల్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. సాధారణ ప్రేక్షకులతో పాటు క్రీడాకారులను కూడా ప్రభావితం చేసిన ఈ చిత్రంపై తాజాగా చైనాకు చెందిన ప్రముఖ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ మహిళా ఫైటర్ షి మింగ్ ప్రశంసలు కురిపించారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. ఆమిర్ ఖాన్ నటన, ఆయన ఎంచుకునే కథలు తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు.'దంగల్'లో ఒక తండ్రిగా తన కూతుళ్లను ఛాంపియన్లుగా తీర్చిదిద్దేందుకు ఆమిర్ చూపిన అంకితభావం తనను ఎంతో ప్రభావితం చేసిందని తెలిపారు. సినిమా చూసిన తర్వాత తనకు వ్యక్తిగతంగా కూడా ప్రేరణ లభించిందన్నారు. ఈ సందర్భంగా 'దంగల్ 2' వస్తే చూడాలని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు షి మింగ్ తెలిపారు. ఒరిజినల్ కథ ముగిసిన తర్వాత ఆ పాత్రల ప్రయాణం ఎలా సాగింది? అంతర్జాతీయ వేదికలపై వారు ఎదుర్కొన్న సవాళ్లు ఏమిటి? వంటి అంశాలతో సీక్వెల్ తీస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. క్రీడా నేపథ్యం ఉన్న సినిమాలు మహిళలకు మరింత ప్రేరణనిస్తాయని ఆమె పేర్కొన్నారు. చైనాలో 'దంగల్' విజయం కేవలం ఆర్థిక పరమైనదే కాకుండా భారత్‌చైనా మధ్య సాంస్కృతిక వారధిగా నిలిచిందన్నారు. కుటుంబ విలువలు, తండ్రికూతుళ్ల అనుబంధం, మహిళల ఎదుగుదల వంటి అంశాలే సినిమాను చైనా ప్రజలకు మరింత దగ్గర చేశాయని చెప్పారు.'3 ఇడియట్స్', 'పీకే', 'దంగల్' వంటి చిత్రాలతో ఆమిర్ ఖాన్ చైనాలో అత్యంత ప్రజాదరణ పొందిన విదేశీ నటుల్లో ఒకరిగా మారారు. అంతర్జాతీయ క్రీడాకారులు కూడా ఆయన సినిమాల సీక్వెల్స్ కోరుకోవడం.. ఆమిర్ గ్లోబల్ స్టార్ పవర్‌కు నిదర్శనంగా సినీ విశ్లేషకులు చెబుతున్నారు.


# 'పెద్ది' ప్రీ రిలీజ్‌కు విజయవాడ సిద్ధం

**హైదరాబాద్:** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' ప్రమోషన్స్ చివరి దశకు చేరుకున్నాయి. దేశవ్యాప్తంగా ఇప్పటికే భారీ హైప్ క్రియేట్ చేసిన చిత్ర యూనిట్.. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సిద్ధమైంది.ముంబైలో ట్రైలర్ లాంచ్, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఏఆర్ రెహమాన్ మ్యూజికల్ కాన్సర్ట్, బెంగళూరు, ఢిల్లీ నగరాల్లో ప్రెస్ మీట్లతో 'పెద్ది'పై భారీ అంచనాలు నెలకొల్పిన మేకర్స్.. ఇప్పుడు విజయవాడలో అభిమానుల కోసం ప్రత్యేక ఈవెంట్ నిర్వహిస్తున్నారు.

జూన్ 1వ తేదీన సాయంత్రం 5 గంటల నుంచి విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా ఈ ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరగనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. భారీ సంఖ్యలో మెగా అభిమానులు హాజరయ్యే అవకాశం ఉండటంతో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.అయితే ఇప్పుడు అందరి దృష్టి ఈ వేడుక ముఖ్య అతిథిపై పడింది. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా.. ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్‌గా హాజరవుతారనే ప్రచారం ఫిలిం నగర్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. పవన్ కళ్యాణ్ అందుబాటును బట్టి విజయవాడలోనే ఈ ఈవెంట్ ప్లాన్ చేశారనే టాక్ వినిపిస్తోంది.

ఒకవేళ ఇదే నిజమైతే.. ఒకే వేదికపై బాబాయ్ పవన్ కళ్యాణ్, అబ్బాయ్ రామ్ చరణ్ కనిపించే అరుదైన సందర్భం కావడంతో మెగా అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది.

ఈ వేడుకలో హీరో రామ్ చరణ్, హీరోయిన్ జాన్వీ కపూర్, దర్శకుడు బుచ్చిబాబు సనతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొననున్నారు.




# బాలయ్య లైనప్‌లో మరో మాస్ ప్రాజెక్ట్?

**హైదరాబాద్:** నందమూరి నటసింహం బాలకృష్ణ వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'NBK111' షూటింగ్‌లో పాల్గొంటున్న బాలయ్య.. మరోవైపు కొరటాల శివ దర్శకత్వంలో రూపొందనున్న 'NBK112' చిత్రాన్ని కూడా జూన్ నుంచి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు బాలయ్య లైనప్‌లోకి మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరే అవకాశాలపై ఇండస్ట్రీలో జోరుగా చర్చ సాగుతోంది.

తాజా సమాచారం ప్రకారం కోలీవుడ్ దర్శకుడు అధిక్ రవిచంద్రన్‌తో బాలయ్య సినిమాచేసేఅవకాశాలు ఉన్నట్లుఫిలింనగర్‌వర్గాల్లోప్రచారంజరుగుతోంది.'మార్క్ ఆంటోని', 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న అధిక్.. ఇటీవల బాలయ్యను కలిసి ఒక పవర్‌ఫుల్ మాస్ యాక్షన్ స్టోరీ వినిపించినట్లు సమాచారం.

ఆ కథ లైన్ బాలయ్యకు నచ్చడంతో దర్శకుడికి గ్రీన్ సిగ్నల్ లభించినట్లు ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి అధిక్ తదుపరి చిత్రం అజిత్ కుమార్‌తో 'AK64'గా తెరకెక్కాల్సి ఉన్నప్పటికీ.. కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదని తెలుస్తోంది. దీంతో ఆ కథను బాలయ్య ఇమేజ్‌కు తగ్గట్టుగా మార్చి మళ్లీ సిద్ధం చేసి వినిపించగా.. బాలకృష్ణ కూడా ఆసక్తి చూపినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్తే బాక్సాఫీస్ వద్ద మరో మాస్ జాతర ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. ఇక ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించే అవకాశాలు ఉన్నాయని సమాచారం.





# జీకే విష్ణుకు సూర్య ఖరీదైన గిఫ్ట్

### సినిమాటోగ్రాఫర్‌కు లగ్జరీ కారు బహుమతిగా ఇచ్చిన సూర్య




**చెన్నై:** కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించిన 'కరుప్పు' చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసిన సంగతి తెలిసిందే. రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతున్న ఈ సినిమా విజయోత్సాహంలో చిత్ర యూనిట్ మునిగిపోయింది. ఈ క్రమంలో సినిమాకు అద్భుతమైన విజువల్స్ అందించిన సినిమాటోగ్రాఫర్ జీకే విష్ణుకు హీరో సూర్య ప్రత్యేక బహుమతిని అందించి మరోసారి తన పెద్ద మనసు చాటుకున్నారు.'కరుప్పు' చిత్ర విజువల్స్‌కు ప్రేక్షకుల నుంచి వచ్చిన ప్రశంసలతో సంతోషించిన సూర్య.. జీకే విష్ణుకు ఖరీదైన 'మహీంద్రా BE6 బ్యాట్‌మాన్ ఎడిషన్' కారును కానుకగా ఇచ్చారు. ఈ గిఫ్ట్ అందుకున్న జీకే విష్ణు తన ఆనందాన్ని సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు.కారుతో దిగిన ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. "జస్ట్ గాడ్ థింగ్స్!! థాంక్యూ సూర్య సర్.. మీకు చాలా పెద్ద మనసు ఉంది" అంటూ ఎమోషనల్ పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.మే 15న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన 'కరుప్పు' చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో సూర్య, త్రిష జంటగా నటించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.320 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. భారతదేశంలోనే రూ.200 కోట్ల మార్క్ దాటిన ఈ సినిమా తమిళనాడులో రూ.150 కోట్ల క్లబ్‌లో చేరింది.సూర్య కెరీర్‌లో తమిళనాడులో రూ.150 కోట్ల గ్రాస్ సాధించిన తొలి చిత్రంగా 'కరుప్పు' నిలిచింది. ఈ చిత్రంలో జీకే విష్ణు అందించిన విజువల్స్, కెమెరా వర్క్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయని ప్రేక్షకులు, సినీ వర్గాలు ప్రశంసిస్తున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com